ఇజ్రాయెల్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- ఒక్కొక్కరి నుంచి రూ.8లక్షల వసూలు
- తప్పించుకునేందుకు చెల్లని చెక్కులు
- బాధితుల్లో కొందరు కోనసీమ వాసులు

7

టీడీపీ రాజోలు ఇన్‌చార్జిగా అమూల్య



గొల్లపల్లి అమూల్య

రాజోలు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాజోలు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జిగా గొల్లపల్లి అమూల్యను నియమించారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు రాష్ట్ర టీడీపీ అధ్యక్షుడు పల్ల శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. అమూల్య రాజోలు మండలం తాటిపాకలో నివాసం ఉంటున్నారు. ఇన్‌చార్జి వచ్చిన సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాజోలు ఎమ్మెల్యే దేవవరప్రసాద్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ముందుకు వెళ్తానని తెలిపారు. రాజోలు నియోజకవర్గంలో పార్టీ అభివృద్ధికి తాను శాయశక్తులా కృషిచేస్తానన్నారు. ఈసందర్భంగా రాజోలు టీడీపీ ఇన్‌చార్జిగా నియమితులైన అమూల్యను తాటిపాకలో ఆమె స్వగృహం వద్ద పలువురు టీడీపీ నాయకులు కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

దేవీశరన్నవరాత్రులు ప్రారంభం

- జిల్లావ్యాప్తంగా వైభవంగా వేడుకలు
- తొలిరోజు బాలాత్రిపుర సుందరిగా అమ్మవారి అలంకరణ

అమలాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దేవీశరన్నవరాత్రులు జిల్లావ్యాప్తంగా భక్తుల కోలాహలం నడుమ సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవార్ల విగ్రహాలను సమీపంలోని కాల్వలు, గోదావరి వద్దకు తీసుకువెళ్లి భక్తులు స్నానాలు ఆచరించి ఆయా ప్రసిద్ధి చెందిన ఆలయాలతోపాటు ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన పందిళ్లలో అమ్మవారి ప్రతిమను అలంకరించి భక్తి, శ్రద్ధలతో పూజా కార్యక్రమాలను నిర్వహించడం ద్వారా ఉత్సవాల ప్రారంభానికి శ్రీకారం చుట్టారు. ద్రాక్షారామ, రాయవరంలోని విజయదుర్గాపీఠంతోపాటు జిల్లాలోని వివిధ ఆలయాలు, ప్రత్యేక మండపాల్లో నవరాత్రులు ప్రారంభం కాగా.. తొలిరోజు అమ్మవారు బాలత్రిపురసుందరి అలంకరణలో జిల్లావ్యాప్తంగా ఉన్న ఆలయాలతోపాటు పందిళ్లలో దర్శనమిచ్చారు.



ప్రత్యేక అలంకరణలో వెదురుపాక విజయదుర్గా అమ్మవారు



అమలాపురంలో బాలాత్రిపురసుందరిదేవిగా కనకదుర్గమ్మ

పన్ను తగ్గింపా..

పండుగ ఆఫరా..

కాకినాడలో ఓ షోరూమ్‌లో అమ్మకాలు



కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ నుంచి సామాన్యులకు భారీ ఉపశమనం కలిగించిన విషయం తెలిసిందే. అయితే ఆ తగ్గింపు కొనుగోలు దారుకు లాభం చేకూర్చడం ఇప్పుడు చిక్కుముడిగా మారింది. జీఎస్టీ తగ్గక ముందు ఎంత ధర, తర్వాత ఏ మేరకు తగ్గిందనే విషయాలు దుకాణాల్లో ఎక్కడా కనబడడం లేదు. తొలిరోజు ఆన్‌లైన్ ప్లాట్‌ఫాంలలో అయితే అంతా అయోమయమే కనిపించింది. అసలే అసలు ధరను అమాంతం పెంచేసి భారీ తగ్గింపును చూపిస్తుంటారు. ఇప్పుడు కూడా ఆ మాదిరిగానే ధరలు ఉండడంతో జీఎస్టీతో తమకు ఏమి ఒరిగిందో వినియోగదారుడికి బోధపడడం లేదు. ఇక మార్కెట్‌లోనూ దసరా పండుగ ఆఫర్లు ప్రారంభించేశారు. దీంతో జీఎస్టీ తగ్గింపు ఎంత మేర, పండుగ ఆఫరు ఎంత డిస్కౌంటు అనే అంశాలు కలగాపులగంగా మారిపోయాయి.

అంతా అయోమయం!





- దసరా ఆఫర్లో కొట్టుకుపోయిన జీఎస్టీ తగ్గింపు ధరలు
- ట్యాక్స్ ఎంత మేర తగ్గిందో షాపుల్లో చూపని వైనం
- కొన్నిచోట్ల పాత స్టాకు పేరుతో దోపిడీ
- తొలిరోజు మార్కెట్‌పై ప్రభావం నిల్

(రాజమహేంద్రవరం/అమలాపురం/కాకినాడ/సామర్లకోట/తుని - ఆంధ్రజ్యోతి)

జీఎస్టీ తగ్గింపు ప్రభావం దసరా ఆఫర్ల మధ్య కనిపించకుండా పోయింది. వివిధ రకాల ఎలక్ట్రానిక్స్ గూడ్స్‌కు దసరా ఆఫర్లు ప్రకటించారు. సోమవారం నుంచి జీఎస్టీ 2.0 అమలులోకి వచ్చినా పెద్దగా ధరలు తగ్గినట్టు కనిపించలేదు. కొన్ని వస్తువులకు మొత్తం జీఎస్టీ తీసేయడంతోపాటు కొన్నింటికి 5 శాతానికి పరిమితం చేయడంతో ధరల్లో స్పష్టమైన తేడా కనిపించాలి. కానీ ఏ షాపుల వద్దా కనీసం తగ్గింపు బోర్డులు పెట్టలేదు. ప్రభుత్వం బోర్డులు పెట్టాలని ముందే స్పష్టం చేసింది కూడా. ఇక దసరా పండుగ ఆఫర్లలో ఎక్కువగా టీవీలు, ఏసీలు, వాషింగ్ మెషీన్లను ఏటా కొంటారు. వీటిపైనా జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం భారీగా తగ్గించింది. గతంలో ఐదు స్లాబులుగా ఉన్న పన్నులను 5, 12 శాతాలతో రెండు స్లాబులకు తీసుకొచ్చింది. దీనిలో కార్ల నుంచి బిస్కట్ల వరకూ దాదాపు 375 వస్తువులను ఈ రెండు శ్లాబుల్లోకి తేగా, కొన్నింటికి సున్నా చేసింది. అయితే ఆ మేరకు వినియోగదారుడికి ఎంత లబ్ధి చేకూరిందో ఏ వస్తువుపై కూడా ఉండడం లేదు. ఉదాహరణకు ఆన్‌లైన్‌లో ఓ కంపెనీ 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీ ధర రూ.59,999గా చూపించి ఏకంగా రూ.30,001 రాయితీ ఇచ్చేస్తున్నారు. మరో కంపెనీ వాస్తవ ధరను రూ.73,990గా చూపించి ఏకంగా రూ.50 వేల డిస్కౌంటును ఇచ్చేస్తోంది. అసలు వాస్తవ ధర నిజమైనదేనా? జీఎస్టీ ఎంత తగ్గింది? పండుగ ఆఫరు ఎంత ఇచ్చారు? అనే అంశాలపై స్పష్టత కరువైంది. ఇక మార్కెట్‌లో కిరాణా తదితర సరుకుల విషయంలో కూడా ఇదే నడుస్తోంది. కొందరు వ్యాపారులు పాత స్టాకు, పాత ధరలకే హోల్‌సేల్‌గా కొన్నామంటూ ధరలు తగ్గించకపోవడం గమనార్హం. కార్లకు మాత్రం వారం రోజుల నుంచి రూ.50 వేల నుంచి లక్షకుపైగా తగ్గినట్టు చెబుతున్నారు. టీవీలు, ఏసీలకు రూ.1500 నుంచి 3 వేల మాత్రమే తగ్గినట్టు కొందరు వ్యాపారులు చెబుతున్నారు. ఈ ధరలు దసరా ఆఫర్ల కింద ముందుగా ప్రకటించినవే. మాల్స్‌లోనూ ఇదే పరిస్థితి. అధికార యంత్రాంగం కదిలితే జీఎస్టీ తగ్గింపు మార్పు కనిపించే అవకాశం ఉంది. చిల్లర దుకాణాల్లో అసలు బిల్లులు ఇవ్వరు కాబట్టి అసలు ధర ఎంతో కూడా తెలియని పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో మార్కెట్‌పై ప్రజలు ఎగబడడం వంటిదేమీ కనిపించలేదు. అయితే కాస్త స్పష్టత వచ్చాకే ఏదైనా కొనుగోలు చేయాలనే యోచనలో ఎక్కువ మంది వినియోగదారులు ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో తొలి రోజు ప్రభావం ఏమీ లేదు.

ఒకటి రెండ్రోజుల్లో మారతాయి...

జీఎస్టీ తగ్గింపు ధరల్లో తొలిరోజు గందరగోళం నెలకొనగా, ఒకటి రెండ్రోజుల్లో దాని ప్రభావం ఉంటుందని కొందరు వ్యాపారులు చెబుతున్నారు. వాస్తవానికి పాల ధరలు తగ్గిస్తున్నట్టు ఇప్పటికే చాలా కంపెనీలు ముందస్తుగా ప్రకటించాయి. అయితే మార్కెట్‌లో ఆ మేరకు తగ్గింపుతో కొందరు విక్రయాలు చేసినా, చాలాచోట్ల పాత ధరతోనే విక్రయించారు. ఇదేమని అడిగితే ప్యాకింగ్‌లో ఉండే మిస్టేక్ వల్ల సవరణ జరగలేదని అమలాపురంలో ఒక పాల వ్యాపారి చెప్పారు. ఒకట్రెండు రోజుల్లో సవరణలు జరుగుతాయని సదరు కంపెనీ వారు చెప్పినట్టు తెలిపారు. వాస్తవానికి పాల ధర లీటరుకు రూ.2, నెయ్యి, పనీర్, బట్టర్ వంటి ఉత్పత్తులపై రూ.15 నుంచి రూ.30 మేర వస్తువును బట్టి తగ్గించారు. ఇక నిత్యావసర వస్తువులపై 18 శాతం ఉంచి ధరలను 5 శాతానికి తగ్గించినప్పటికీ కిరాణా, ఇతర ఉత్పత్తులపై ఇంకా తగ్గింపు అమలుచేసేందుకు వ్యాపారులు ఆచితూచి అడుగులు వేస్తున్నారు. గతంలో తాము జీఎస్టీ చెల్లించి పూర్తిస్థాయిలో కొనుగోలు చేసిన వస్తువుల ధరలను తగ్గిస్తే నష్టపోతామనే భయంతో పాత రేట్లతోనే వసూలు చేస్తున్నారు. వెంటనే అధికారులు తనిఖీలకు సిద్ధం కాకపోతే ఇంకొంతకాలం పాత ఎమ్మార్పీలతో విక్రయించే అవకాశం ఉంది.

తగ్గితే పండగే..

జీఎస్టీ తగ్గింపుతో సుమారు 375 రకాల ఉత్పత్తులపై పన్ను రేట్లు తగ్గాయి. ముఖ్యంగా ఎఫ్ఎంసీజీ, వాహన, ఎలక్ట్రానిక్, డెయిరీలు, పాల ఉత్పత్తులపైనా ధరలు సామాన్యులకు అందుబాటులోకి వచ్చాయి. సెలూన్లు, వ్యాయామ-యోగా కేంద్రాలపై, ఫేస్ పౌడర్, షేవింగ్ క్రీమ్, సబ్బుల వంటి వ్యక్తిగత సౌందర్య ఉత్పత్తులపై పన్ను 18 శాతం నుంచి 5 శాతం తగ్గింది. జీఎస్టీ తగ్గుదలతో ప్రతి కుటుంబానికి వేలాది రూపాయలు ఆదా జరుగుతుందని కేంద్రం చెబుతోంది. నిజానికి పూర్తిస్థాయిలో ధరల తగ్గింపు అమలు జరిగితే ప్రజలకు లాభదాయకమే.



అమ్మవారికి పూజలు చేస్తున్న ఎంపీ పురందేశ్వరి

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు మేలు : ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ సంస్కరణలతో పేదలు, మధ్యతరగతి వర్గాలకు మేలు జరుగుతుందని రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. శరన్నవరాత్రుల ప్రారంభం సందర్భంగా రాజమహేంద్రవరం దేవీచౌక్‌లోని అమ్మవారిని సోమవారం ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పురందేశ్వరి మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలపై జీఎస్టీ సరళీకృతం వల్ల ధరలు తగ్గి రైతులకు ఆదాయం పెరుగుతుందని చెప్పారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో ఈ-పోస్ మిషన్లు కీలకం: జేసీ



కలెక్టరేట్‌లో రేషన్‌డీలర్లకు ఈ-పాస్ యంత్రాలను అందిస్తున్న జేసీ నిషాంతి

- వాటితో రేషన్‌లో అక్రమాలకు చెక్
- డీలర్లకు కొత్త యంత్రాల అందజేత

అమలాపురం,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజాపంపిణీ వ్యవస్థలో ప్రభుత్వం కొత్తగా అందిస్తున్న ఈ-పోస్ మిషన్లు కీలకంగా సేవలందిస్తాయని జేసీ నిషాంతి అన్నారు. అమలాపురంలోని ప్రజావేదిక కార్యాలయంలో సోమవారం కొత్త ఈ-పోస్‌మిషన్లను రేషన్‌డీలర్లకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ఈ-పోస్ మిషన్లు డిజిటల్ వేయింగ్ స్కేల్‌తో సమ్మిళితమయ్యాయన్నారు. మానవీయ తప్పులను ఈ-పోస్ యంత్రం నివారించడం ద్వారా కచ్చితమైన రీతిలో రేషన్ పంపిణీ నిర్ధారణ జరుగుతుందని తెలిపారు. కార్డుదారులు వస్తే వారి ఆధారిత డేటాను ఉపయోగించి బయోమెట్రిక్ స్కాన్ ద్వారా ధ్రువీకరణచేసి అర్హత కలిగిన వారు మాత్రమే రేషన్ సదుపాయం పొందగలుగుతారన్నారు. మిషన్ల వస్తువుల బరువు, ట్రాన్స్‌క్షన్ రికార్డింగులో కచ్చితత్వం, టెక్నికల్ లోపాల్లో తగ్గుదల, కార్డుదారుడి సంతృప్తిలో మెరుగైనదిగా కనిపిస్తుందన్నారు. డీఆర్వో కె.మాధవి, సివిల్ సప్లయిస్ అధికారి అడపా ఉదయభాస్కర్, మేనేజర్ పి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

అమలాపురం ఏరియా ఆస్పత్రిలో జేసీ తనిఖీ



అమలాపురంలోని ఏరియా ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న జేసీ నిషాంతి

- వైద్యుల గైర్హాజరుపై ఆగ్రహం
- పారిశుధ్యం అధ్వానంగా ఉందని వ్యాఖ్య

అమలాపురం,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విధులకు హాజరవుతున్నట్టు సంతకాలు పెట్టి గైర్హాజరవుతున్న వైద్యసిబ్బందిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని జేసీ టి.నిషాంతి హెచ్చరించారు. అమలాపురంలోని ప్రాంతీయఆస్పత్రిని సోమవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసి ఆస్పత్రి నిర్వహణలో పలు లోపాలను గుర్తించారు. విధినిర్వహణలో వైద్యులు గైర్హాజరు, పరిశుభ్రతా ప్రమాణాలు పాటించకపోవడం, రోగులకు సక్రమంగా సౌకర్యాలు అందించకపోవడం వంటి అంశాలు కనిపించాయన్నారు. హాజరుపట్టీలో సంతకాలు చేసి విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల తీరుపై జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. పారిశుధ్యం పూర్తిగా లోపించిందని, ఇలాఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆస్పత్రినిర్వహణపట్ల, సిబ్బందిపైనా అధికారులు నిఘా పెట్టాలని ఆదేశించారు. వార్డుల్లో రోగులకుఅందుతున్న సేవలపై ఆరా తీశారు. వైద్యుల తీరుపట్ల ఆమె అసంతృప్తి వ్యక్తం చేశారు. సూపర్‌వైజర్ శంకరరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేటలో గ్యాస్ పైపులైన్ లీకేజీ 7

పన్నుల సేకరణపై దృష్టిపెట్టాలి



కలెక్టరేట్‌లో పంచాయతీ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

- జిల్లా పంచాయతీ ఉద్యోగులతో సమీక్షలో కలెక్టర్ మహేష్

అమలాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వమిత్ర సర్వే లెగసీ వేస్ట్ మేనేజ్‌మెంట్ స్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా పన్ను సేకరణ అంశాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని కలెక్టర్ మహేష్‌కుమార్ పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కలెక్టరేట్‌లో పంచాయతీ సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. కేపీఐ ఇండికేటర్స్ అప్‌లోడ్, స్వమిత్ర సర్వేస్వర్ణ పంచాయతీ పోర్టల్ ద్వారా పన్నుల సేకరణ, 15వ ఆర్థిక సంఘం నిధుల కేటాయింపు, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల పనితీరు, లేఅవుట్ల అనుమతులు, మంజూరు, పంచాయతీ ఆదాయ ఖర్చుల అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. పంచాయతీల్లో డంపింగ్ యార్డుల నిర్వహణకు శాశ్వత ప్రాతిపదికన స్థలాలు ఉన్నదీ లేనిదీ తెలియజేయడంతో సేకరించిన చెత్త నిర్వహణ తీరు గురించి వివరాలు వెల్లడించాలని స్పష్టంచేశారు. 15వ ఆర్థిక సంఘం నిధుల వినియోగంపై ఆరాతీసి మండలాలవారీగా పంచాయతీలకు పన్నుల సేకరణ, ఇతరత్రా ఆదాయ వనరుల లభ్యత, బడ్జెట్ కేటాయింపు ఖర్చుల అంశాలపై సమగ్ర నివేదికను మూడురోజుల్లో సమర్పించాలని డీపీవోను ఆదేశించారు. వేస్ట్‌మేనేజ్‌మెంట్‌కోసం అమలాపురం, రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలకు సంబంధించి సమీపంలోని గ్రామాల ద్వారా వచ్చే రోజువారీ చెత్తను పట్టణ కేంద్రాలకు తరలించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కాల్వగట్లు, జాతీయ రహదారుల వెంబడి చెత్తనంతటినీ ఒకేచోటుకు తరలించి ప్రాసెస్ చేసేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. ఈ విధానం అమలుపై ఇప్పటికే కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు పొందామన్నారు. గ్రామ కంఠాల్లో సమగ్రంగా సర్వే నిర్వహించి భవిష్యత్తులో ఆస్తులకు సంబంధించి రికార్డులను నవీకరించాలని, ఎటువంటి వివాదాలకు ఆస్కారం లేని డిజిటల్ రికార్డులు రూపొందించాలని సూచించారు. స్వర్ణపంచాయతీ పోర్టల్ ద్వారా ఫోన్‌పే యాప్ ద్వారా పూర్తిస్థాయిలో పన్నులు సేకరించి సమర్థవంతమైన పంచాయతీ నిర్వహణ చేపట్టాలని డీపీవోను ఆదేశించారు. కార్యక్రమంలో డీపీవో శాంతలక్ష్మి, ఎల్డీవోలు వేణుగోపాల్, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

25న డీఎస్సీ అభ్యర్థులకు నియామకపత్రాలు

మెగా డీఎస్సీ-2025 రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ఎంపికైన అభ్యర్థులకు ఈనెల 25వ తేదీ మధ్యాహ్నం 3గంటలకు అమరావతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం చంద్రబాబు అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ చేస్తారని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి రాజమహేంద్రవరంలోని నిర్దేశించిన వేదిక వద్దకు అభ్యర్థులు చేరుకోవాలని సూచించారు. 25న ఉదయం అమరావతికి బయలుదేరి వెళ్లాల్సి ఉంటుందన్నారు. మార్గమధ్యలో భీమడోలు సమీపంలో బయలుదేరివెళ్లే అభ్యర్థులకు మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారంలో ఉదాశీనత వహిస్తే చర్యలు తప్పవు: కలెక్టర్



గోదావరిభవన్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ మహేష్

అమలాపురంటౌన్,సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారంలో అధికారులు ఉదాశీనంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ మహేష్‌కుమార్ హెచ్చరించారు. రాష్ట్రప్రభుత్వం పీజీఆర్ఎస్‌ను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తుందన్నారు. అర్జీదారుల్లో విశ్వసనీయత పెరిగేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. ఎండార్స్‌మెంట్ ఇచ్చేసి చేతులు దులుపుకోవాలని చూస్తే సహించేది లేదన్నారు. తప్పనిసరిగా సమస్యకు సరైన పరిష్కారం చూపించాల్సిందేనని స్పష్టంచేశారు. కలెక్టరేట్‌లోని గోదావరిభవన్‌లో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లాస్థాయిలో నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారి నుంచి కలెక్టర్‌తో పాటు జేసీ టి.నిషాంతి, జిల్లా రెవెన్యూ అధికారి కె.మాధవి, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్, సమగ్రశిక్ష ఏపీసీ జి.మమ్మీ, ఎస్డీసీ కృష్ణమూర్తి, డీఎల్డీవో రాజేశ్వరరావు 205 అర్జీలు స్వీకరించారు.

పీజీఆర్ఎస్‌లో మార్పులు..

అర్జీదారుల సమస్యల పరిష్కారంలో భాగంగా పీజీఆర్ఎస్‌లో మార్పులు తీసుకువచ్చారని జేసీ నిషాంతి అన్నారు. ఇప్పటివరకు నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు భిన్నంగా పలు మార్పులు చేశామన్నారు. కలెక్టరేట్‌లో అందిన అర్జీపై సంబంధిత జిల్లాఅధికారి అర్జీదారుడి సమస్యకుగల మూలకారణం తెలుసుకుని పరిష్కరించాల్సిఉంది. అంతకుముందు ఈ సమస్య గ్రామ, మండల, డివిజన్‌స్థాయి అధికారుల దృష్టికి తీసుకువెళ్లారా, సమస్య పరిష్కారంలో కిందిస్థాయి అధికారులు చూపిన అలసత్వం, అర్జీదారునికి ఇబ్బందులు కలిగించారా తదితర అంశాలను పరిశీలించాలి. సమస్య పరిష్కారం ఏ స్థాయిలో చేయాలో గుర్తించి సమగ్ర వివరాలను అర్జీలో నమోదు చేసి తదుపరి చర్యల నిమిత్తం అర్జీదారుడు కలెక్టర్‌ను కలిసేలామార్పులు చేశారన్నారు. అర్జీలపరిష్కారంలో జాప్యానికి అధికారులే బాధ్యత వహించాలన్నారు.



ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికలో అర్జీదారులతో ఎస్పీ

ఫిర్యాదుదారులతో ఎస్పీ ముఖాముఖి

అమలాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారంకోసం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఎస్పీ రాహుల్‌మీనా సోమవారం పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఫిర్యాదుదారులనుంచి లిఖితపూర్వక అర్జీలను ఆయన స్వీకరించారు. వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకుని సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి చట్టపరిధిలో విచారించి త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశాలిచ్చారు. ఫిర్యాదుదారుల అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించి వారికి న్యాయం చేయాలని ఆ ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను ఎస్పీ కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని ఆదేశించారు. వివిధ సమస్యలపై మొత్తం 19 మంది ఎస్పీకి అర్జీలు స్వయంగా అందజేశారు.

సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగుల శాంతియుత ర్యాలీ

అమలాపురంటౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోరుతూ దశలవారీ ఆందోళనలో భాగంగా సోమవారం శాంతియుత ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర పవర్ ఎంప్లాయిస్ జేఏసీ, డిస్కం ఐక్య కార్యాచరణ కమిటీ పిలుపు మేరకు అమలాపురం నల్లవంతెనవద్ద ధర్నాచౌక్ నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. విద్యుత్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీలో పాల్గొన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘ కన్వీనర్ అంబటి రాజారత్నం, జేఏసీ చైర్మన్ మట్టపర్తి వెంకటరమణ, జేఏసీ కన్వీనర్ సరెళ్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఉద్యోగులు నిరసనలు తెలిపారు. విద్యుత్‌ఉద్యోగులకు, పెన్షనర్లకు వారి కుటుంబసభ్యులకు పూర్తి వైద్యఖర్చులు చెల్లించాలని జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను ఉద్యోగులు అందరికీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ మహేష్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వివిధ యూనియన్ల నాయకులు సరెళ్ల సత్యనారాయణ, పీఎస్ఎస్ వెంకటేశ్వరరావు, దంగేటి నరేంద్రకుమార్, వి.వెంకటేశ్వరరావు,శ్రీనివాస్‌శెట్టి, రామచంద్రపురం డివిజన్ జేఏసీ చైర్మన్ అడపా వెంకట్, కన్వీనర్ వి.రాజ్‌కుమార్, వేగుళ్ల వీర్రాజు పాల్గొన్నారు.



అమలాపురంలో శాంతి ర్యాలీ చేస్తున్న విద్యుత్ ఉద్యోగులు



తాపేశ్వరం-ఇప్పనపాడు మధ్య ప్రమాదకరంగా మారిన కల్వర్టుల వద్ద ర్యాంపులు వేస్తున్న దృశ్యం

ద్వారపూడి-తాపేశ్వరం రోడ్డులో కల్వర్టుల వద్ద తాత్కాలిక మరమ్మతులు

- 'నిత్యం నరకమే' కథనానికి స్పందించిన అధికారులు
- ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన

మండపేట,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): మండపేటలోని ద్వారపూడి-తాపేశ్వరం రోడ్డులో కల్వర్టులవద్ద రోడ్లకు ఆర్అండ్‌బీ అధికారులు తాత్కాలిక మరమ్మతులు చేయించారు. త్వరలో పూర్తిస్థాయి నిర్మాణం చేపడతామని తెలిపారు. ఈరోడ్డులో కల్వర్టులవద్ద దుస్థితిపై 'నిత్యం నరకమే' పేరిట ఆంధ్రజ్యోతి పత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. ఈమేరకు రామచంద్రపురం రోడ్లు,భవనాలశాఖ డీఈఈ సూర్యనారాయణ సారథ్యంలో తాపేశ్వరం, ఇప్పనపాడు మధ్యఉన్న కల్వర్టులవద్ద రోడ్లకు యుద్ధప్రాతికన అప్రోచ్‌లు(ర్యాంపులు) నిర్మించారు. తాత్కాలిక చర్యల్లో భాగంగా నిత్యం జరిగే ప్రమాదాలను దృష్టిలో ఉంచుకుని యుద్ధప్రాతికన పనులు చేశామని, కొద్దిరోజుల్లో నాలుగు కల్వర్టులు మధ్య నిలిచిపోయిన రోడ్డు పనులు చేపట్టి పూర్తి చేస్తామని తెలిపారు.



రత్నగిరిపై బాల అలంకరణలో వనదుర్గ అమ్మవారు

అన్నవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిపావంచా వద్ద ఉన్న కనకదుర్గ ఆలయంలో ఉదయం 8 గంటలకు గణపతిపూజతో పండితులు క్రతువుకు శ్రీకారం చుట్టారు. రుత్వికులకు దేవస్థానం ఈవో సుబ్బారావు దీక్షా వస్త్రాలను అందజేశారు. అనంతరం జపాలు, పారాయణలు, సూర్యనమస్కారాలు నిర్వహించారు. సాయంత్రం నాలుగు గంటలకు వనదుర్గ, కనకదుర్గ ఆలయాల్లో లక్ష కుంకుమార్చన జరిపారు. తొలిరోజు అమ్మవారు బాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.



బాలాత్రిపురసుందరిగా తలుపులమ్మ

తుని రూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారికి వేకువజామునే ఆలయ పండితులు పూజలు జరిపారు. బాలాత్రిపుర సుందరీదేవిగా అనుగ్రహించిన అమ్మవారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



బ్రాహ్మిగా దర్శనమిచ్చిన మహాలక్ష్మి అమ్మవారు

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): శృంగేరి శంకర మఠం నిర్వహణలో కాకినాడ జిల్లా పిఠాపురంలో కొలువైయున్న మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్వాహకుడు ఇంద్రగంటి వెంకట గోపాలకృష్ణ దంపతులు కలశస్థాపన, ఇతర పూజలు జరిపించారు. మహాలక్ష్మి అమ్మవారు తొలిరోజు బ్రాహ్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

జగజ్జననికి నీరాజనం

అంగరంగ వైభవంగా ప్రారంభమైన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో రాజరాజేశ్వరీదేవి

పాదగయలో రాజరాజేశ్వరిగా అమ్మవారి దర్శనం

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి సన్నిధిలో వేంచేసియున్న రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్ల శరన్నవరాత్ర శత చండీ యాగ మహోత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వరుడు, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవార్లకు ప్రత్యేక పూజలు జరిపారు. వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఉత్సవాల సమయంలో అమ్మవార్లను అలంకరించేందుకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టుచీరలు, పండ్లు, పుష్పమాలలను అర్చకులకు జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, జనసేన నాయకులు అందజేశారు.

రాజరాజేశ్వరీదేవి తొలిరోజు రాజరాజేశ్వరి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాగణపతికి విఘ్నేశ్వర పూజ, కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, రాజరాజేశ్వరీదేవికి ప్రాతఃకాల విశేష సహస్రనామార్చన, కుంకుమార్చన జరిగాయి. పురుహూతికా అమ్మవారి శతచండీ యాగ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రీచక్ర నవావరణార్చన సహిత సహస్ర పుష్పార్చన, శ్రీచక్ర లక్ష కుంకుమార్చన జరిగాయి. ఈవో కాట్నం జగన్మోహనశ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.



విశేష అలంకరణలో పురుహూతికా అమ్మవారు



శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ పంపిన పట్టువస్త్రాలు సమర్పిస్తున్న జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు





కాకినాడ శ్రీపీఠంలో లలితా సహస్రనామ కుంకుమార్చన చేస్తున్న మహిళలు

మహాశక్తి యాగం ఆరంభం

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ శ్రీపీఠం ప్రాంగణం ఎరుపు, కాషాయ రంగు చీరలు ధరించిన మాతృమూర్తులతో నిండిపోయింది. లలితా సహస్ర నామం, అమ్మ నామస్మరణతో ఆ పరిసరాలు మార్మోగాయి. దేవీ శరన్నవరా త్రుల్లో భాగంగా రమణయ్యపేటలోని శ్రీపీఠం వెనుక సుమారు 5 ఎకరాల స్థలంలో శ్రీపీఠం వ్యవస్థాపకులు స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో 11 రోజుల పాటు జరిగే 3వ మహాశక్తి యాగం-2025 వేలాది మంది భక్తుల నడుమ సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఐశ్వర్యాంబిక అమ్మవారికి హారతి ఇచ్చి వెయ్యి కోట్ల లలితా సహస్రనామ కుంకుమార్చనలో భాగంగా వంద కోట్లు కుంకుమార్చన మహా క్రతువుకు శ్రీకారం చుట్టారు. అనంతరం స్వామి మాట్లాడుతూ త్రికరణ శుద్ధితో తలపెట్టిన సంకల్పానికి మించిన బలం మరేదీ లేదన్నారు. అమ్మ అంటే అందరికీ ఇష్టమేనని, ఈ సృష్టిలో మాట్లాడలేని మూగజీవి కూడా అమ్మ అంటుందన్నారు. ఏ దాదిలో మూడు నవరాత్రులు వస్తాయన్నారు. సరస్వతి శక్తి అంటే జ్ఞానం ఇచ్చే శక్తి. వారాహి నవరాత్రుల్లో, గుప్త నవరాత్రుల్లో వర్షాలు పడతాయన్నారు. వర్షం అంటే లక్ష్మీదేవి అని, ఆదిలక్ష్మి సంపదకు సంకేతంగా ఉంటుందన్నారు. ఉదయం రుత్వికుల ఆధ్వర్యంలో సహస్ర చండీ, వారాహి, ప్రత్యంగిరా, బగళాముఖి, రాజశ్యామల, వటుక భైరవ హోమం, సహస్ర రుద్ర మహా రుద్ర హోమం నిర్వహించారు. రాష్ట్రం నలుమూలలతో పాటు వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 15వేల మంది భక్తులు హాజరయ్యారని అంచనా వేశారు. భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఏఆర్ ఏఎస్పీ ఎస్.శ్రీనివాసరావు బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



మహా శక్తి యాగ క్రతువుకు శ్రీకారం చుడుతున్న స్వామి పరిపూర్ణానంద



దేవీచౌక్‌లో అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

దేవీ'చౌక్' వైభవం...

రాజమహేంద్రవరం సిటీ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని దేవీచౌక్‌లో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలి రోజు అమ్మవారు స్వర్ణకవచ కనకదుర్గగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన వేదికపై అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. దేవీచౌక్ పరిసరాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ అలంకరణలు భక్తులను ఆకట్టుకున్నాయి.







సామర్లకోట, ద్రాక్షారామల్లో విశేష అలంకరణల్లో బాలాత్రిపురసుందరి, మాణిక్యాంబ అమ్మవార్లు

సామర్లకోట, ద్రాక్షారామల్లో బాలాత్రిపురసుందరిగా...

సామర్లకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): పంచారామ పుణ్యక్షేత్రమైన సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో వేంచేసియున్న బాలాత్రిపురసుందరి అమ్మవారికి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, కలశస్థాప నలను ప్రధానార్చకులు వేమూరి సోమేశ్వరశర్మ, చెరుకూరి సుందరరామయ్య (రాంబాబు), సన్నిధిరాజు వెంకటరమణ, అళక్కి రాజగోపాలశర్మ వేదమంత్రో చ్చారణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దుర్గాసప్తశతి పారాయణ, బాలాపరమేశ్వరీ మంత్రజపం, స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర బిల్వార్చన, అమ్మవారికి నవవరణార్చన జరిపారు. ఈవో బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో ధర్మకర్తల మండలి మాజీ చైర్మన్ కంటే జగదీష్‌మోహన్(బాబు), తాతపూడి పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అమ్మవారిని బాలాత్రిపుర సుందరిగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచీ తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. శ్రీచక్ర పండితుడు వేమూరి సోమేశ్వర శర్మ ఆధ్వర్యంలో విశేష హోమాలు చేశారు.

ద్రాక్షారామ, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ద్వాదశ శక్తి పీఠమైన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి ఆలయంలో మాణిక్యాంబ అమ్మవారి సన్నిధిలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను సహాయ కమిషనరు అల్లు వెంకట దుర్గాభవాని, అర్చకులు సంకల్పం చేసి ప్రారంభించారు. అనంతరం వైదిక క్రతువులు, వేద పారాయణ, సూర్యనమస్కారాలు, మహా లింగార్చన, అమ్మవారి అనుష్టానాలు, శ్రీచక్ర నవావరణార్చన జరిపారు. సాయంత్రం సువర్ణ, రజత, విశేష పుష్పార్చన, చతుర్వేద స్వస్తి, నీరాజన మంత్రపుష్పాలు, సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. రాత్రి కవాట బంధనం చేశారు. ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పందిరిలో అమ్మవారిని బాలాత్రిపురసుందరీదేవిగా అలంకరణ చేశారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని పూజలు చేశారు.

నాందీ ఫౌండేషన్‌తో నన్నయ ఎంవోయూ

వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ



ఎంవోయూ పత్రాలను పరస్పరం అందిపుచ్చుకుంటున్న దృశ్యం

దివాన్‌చెరువు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ప్రయోజనం చేకూరేవిధంగా నాంది ఫౌండేషన్‌తో ఒప్పందం చేసుకున్నట్టు ఉపకులపతి ఆచార్య ఎస్.ప్రసన్నశ్రీ తెలిపారు. నన్నయ వర్శిటీలో వీసీ ప్రసన్నశ్రీ సమక్షంలో సోమవారం రిజిస్ట్రార్ ఆచార్య కేవీ స్వామి, నాందీ ఫౌండేషన్ ప్రాంతీయ మేనేజర్ శ్రీలక్ష్మి ఎంవోయూలపై సంతకాలు చేసి పరస్పరం పత్రాలు అందిపుచ్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ రాష్ట్రంలో తొలిసారిగా నన్నయ వర్శిటీతో నాంది ఫౌండేషన్ చేసుకున్న ఒప్పందం ద్వారా నన్నయ విశ్వవిద్యాలయం మెయిన్ క్యాంపస్, తాడేపల్లిగూడెం, కాకినాడ క్యాంపస్‌లతో బాటు ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని అనుబంధ కళాశాలల విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుందని అన్నారు. వర్శిటీ, అనుబంధ కళాశాలల్లోని 22 వేల మంది విద్యార్థులకు ఉద్యోగావకాశాలకు అవసరమైన శిక్షణను ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కళాశాలల్లోని విద్యార్థులకు ఉచిత ఉపాధి డొమైన్ నైపుణ్య శిక్షణా కార్యక్రమం నిర్వహించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఎంవోయూను విద్యార్థులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో విశ్వవిద్యాలయం శిక్షణా ఉపాధి కల్పన విభాగం అధికారి ఆచార్య బి.జగన్మోహనరెడ్డి, వర్శిటీ అధికారులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్కూల్ గేమ్స్ క్రీడాకారుల ఎంపిక

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో బుధవారం ఉదయం 9 గంటలకు 19 బాలురు, బాలికలకు జిల్లా స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్, ఖోఖో, హ్యాండ్ బాల్, రెజ్లింగ్ క్రీడాకారుల ఎంపిక జరుగుతాయని స్కూల్ గేమ్స్ సెక్రటరీలు శ్రీనివాసరావు, సుధారాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు కె.శ్రీనివాసరావు 90593 17248, 96035 04337 నెంబర్లలో సంప్రదించాలని ఒలింపిక్ అసోసియేషన్ సెక్రటరీ రవిరాజు కోరారు.

వయోలిన్ 'గంగా' ప్రవాహం



వయోలిన్‌పై కీర్తనలు వాయిస్తున్న గంగా శశిధరన్

కార్పొరేషన్(కాకినాడ), సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ సరస్వతి గాన సభ 122వ దసరా గానసభలు నగరంలోని సూర్యకళా మందిరంలో సోమవారం ప్రారంభ మయ్యాయి. బాల మాంత్రికురాలిగా కీర్తి గడించిన గంగా శశిధరన్ వయోలిన్ సోలో కచేరీ గంగా ప్రవాహంలా అత్యద్భుతంగా జరిగింది. అయిగిరి నందినితో ప్రారంభించి...హంసధ్వని రాగంలో దీక్షితుల వారి వాతాపిగణపతింభజే, శ్రీ రాగంలో త్యాగరాస్వామి వారి ఎందరో మహానుభావులు, రంజని, శ్రీరంజని, మనోరంజని రాగాల్లో వాగ్గేయకారుల దేవీ కృతులను ఆమె వాయించారు.గంగకు తృప్పుణిత్తుర శ్రీకాంత్ మృదంగంపై, తృప్పుణిత్తుర కుమార్ డోలుపై, మంజూర్ ఉన్నికృష్ణన్ ఘటంపై చక్కటి సహకారం అందించారు. సరస్వతి గానసభ సభ్యులు, అధిక సంఖ్యలో సంగీతప్రియులు కార్యక్రమాన్ని ఆద్యంతం వీక్షించి ఆనందించారు.

పాదగయ పుష్కరిణిలో నీరు తొలగింపు



పిఠాపురం పాదగయ పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్న దృశ్యం

పిఠాపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ పుష్కరిణిలో నీటి తొలగింపును సోమవారం ప్రారంభించారు. మహాలయ పక్షాల సమయంలో 15 రోజులు దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా తరలివచ్చి పిండప్రదానాలు చేయడంతో పాటు వాటిని పుష్కరిణిలో కలిపారు. దీనితో పుష్కరిణిలో నీరు కలుషితమై వాసన వస్తుండడంతో నీరు తొలగించాలని అధికారులు నిర్ణయించారు. ఇందుకు అనుగుణంగా పుష్కరిణిలో నీటిని తొలగిస్తున్నారు. నీటిని పూర్తిగా తొలగించి పుష్కరిణిని శుభ్రపరచి కొత్త నీరు పెడతామని పాదగయ కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు. అప్పటివరకు పాదగయకు వచ్చే సాధారణ భక్తులతో పాటు భవానీ మాలధారులు జల్లు స్నానాలు ఆచరించేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని చెప్పారు.

సంస్థను మోసం చేసిన ఉద్యోగి అరెస్టు

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అన్నం పెట్టే సంస్థకే కన్నం వేసిన కేటుగాడిని ప్రకాశంనగర్ పోలీసులు కటకటాల్లోకి నెట్టారు. సీఐ బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరా ఫైనాన్స్ కంపెనీలో 2018లో గోకవరానికి చెందిన బల్లేని వీరబాబు చిరుద్యోగిగా విధుల్లో చేరాడు. అనంతరం మేనేజర్ స్థాయికి ఎదిగాడు. సంస్థ లావాదేవీల్లో పూర్తిగా పట్టు ఉండడంతో కస్టమర్ల ఆధార్‌కార్డులను అక్రమంగా వినియోగించి,ఫోర్జరీ సంతకాలతో వాహనాలకు ఫైనాన్స్ చేయడం మొదలు పెట్టాడు. తద్వారా వచ్చిన డబ్బులను సంస్థ ఖాతాలో జమ చేయకుండా జల్సాలకు వాడుకొన్నాడు. ఇలా సుమారు రూ.30 లక్షల అక్రమానికి పాల్పడ్డాడని సీఐ పేర్కొన్నారు.సంస్థ ఫిర్యాదుతో అతడిని అరెస్టు చేశామన్నారు.


ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి: డీపీఎం

కడియం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి వ్యవసాయ విధానం వైపు దృష్టి సారించాలని ప్రకృతి వ్యవసాయ డీపీఎం తాతారావు తెలిపారు.మురమండ రైతు సేవా కేంద్రంలో సోమవారం రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రసాయనిక ఎరువులు,పురుగుమందులు లేకుండా జీవామృతం, ఘనామృతం వంటి వాటితో సాగు చేయడం ద్వారా అటు రైతులకు తక్కువ పెట్టుబడితోపాటు నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్, సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఈస్టిండియా పాలనలోనే దసరా వేళ.. కనకదుర్గమ్మపై ప్రేమతో నాణెం ముద్రణ

మండపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మనదేశాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ పాలిస్తున్న సమయంలో దసరా పండుగల సందర్భంగా కనకదుర్గమ్మ చిత్రాన్ని 1808లో ఆప్ అణా పేరిట రాగినాణేన్ని ముద్రించి హిందువుల పండుగల పట్ల వున్న అభిమానాన్ని చాటుకున్నారు. 1616 సంవత్సరంలో ఈస్ట్ ఇండియా కంపెనీ లక్ష్మీదేవి అమ్మవారి చిత్రాన్ని ఆప్ అణా రాగినాణంపై ముద్రించారు. సుమారు 404 సంవత్సరాల క్రితం లక్ష్మీదేవిని రాగి నాణంపై ముద్రించిన చరిత్ర ఈస్ట్ ఇండియా కంపెనీకి దక్కుతుంది. 1818లో ముద్రించిన కనకదుర్గమ్మ నాణెం 207 సంవత్సరాల తర్వాత కూడా చెక్కుచెదరకుండా ఉంది. అయితే దేవతామూర్తుల నాణాలు చెల్లుబాటు అయ్యేలా ముద్రించడం విశేషం. కాగా ఈ నాణాలు కపిలేశ్వరపురం మండలం అంగరకు చెందిన తోరాటి నాగభూషణం వద్ద నేటికీ భద్రంగా ఉన్నాయి.







మంచు మైమరపించు...

మెట్టలో మంచు అందాలు మైమరపిస్తున్నాయి. తూర్పు కనుములు పచ్చదనాన్ని పరుచుకుని ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. కాకినాడ జిల్లా తుని జాతీయ రహదారిపై సోమవారం మంచు తెరలు ఇలా కమ్ముకుని కొండలకు కొత్త వన్నె తెచ్చాయి. ఈ దృశ్యాలను ఆంధ్రజ్యోతి క్లిక్ మనిపించిందిలా...
- తుని రూరల్ (ఆంధ్రజ్యోతి)

ఇజ్రాయెల్‌లో ఉద్యోగాల పేరుతో మోసం

- ఒక్కొక్కరి నుంచి రూ.8 లక్షల వసూలు
- తప్పించుకునేందుకు చెల్లని చెక్కులు ఇచ్చిన వైనం
- బాధితుల్లో కొందరు కోనసీమ వాసులు
- జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు బాధితుల నిరసన


చెల్లని చెక్కులను చూపిస్తున్న బాధితులు

గద్వాల క్రైం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఇజ్రాయిల్ దేశంలో ఉద్యోగాల పేరుతో మోసం చేయడంతో బాధితులు తెలంగాణలోని జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేశారు. బాధితుల కథనం మేరకు.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేదిలో 2023 నవంబరు 12న సేవా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జోగుళాంబ గద్వాల జిల్లా ధరూరుకు చెందిన మరనాత మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ కె.సుదర్శన్ అబ్రహంను స్థానికుడొకరు వారికి పరిచయం చేశారు. ఇజ్రాయెల్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించిన అబ్రహం రూ.8 లక్షల చొప్పున 42 మంది వద్ద డబ్బు వసూలు చేశాడు. 2024 జూలై 9న వారిని ఇజ్రాయెల్‌కు పంపించాడు. అక్కడ ఉద్యోగాలు ఇప్పించక పోవడంతో వారంతా జూలై 16న స్వదేశానికి తిరిగి వచ్చారు. మరుసటి రోజు వారందరూ ధరూరుకు వచ్చి అబ్రహంను కలిసి తమ డబ్బు తిరిగి ఇచ్చేయాలని ఒత్తిడి చేశారు. దీంతో వారందరికీ వేర్వేరు తేదీలతో చెక్కులు ఇవ్వడంతో స్వస్థలాలకు వెళ్లిపోయారు. అయితే చెక్కులేవీ చెల్లకపోవడంతో అప్పటి నుంచి పలుమార్లు బాధితులు పాస్టర్‌ను ఫోన్లలో సంప్రదిస్తూనే ఉన్నారు. కొందరు స్వయంగా వచ్చి డబ్బుల డిగారు. కొన్నాళ్లకు ఫోన్ ఎత్తకపోవడంతో ఈ నెల 13న 15 మంది బాధితులు ధరూరులోని మరనాత చర్చికి వచ్చారు. పాస్టర్ సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డబ్బులు ఇచ్చే వరకు ఇక్కడే ఉంటామని చెప్పి, చర్చి పక్కనున్న ఓ హాల్‌లో ఉంటున్నారు. కాగా.. రెండ్రోజుల క్రితం పాస్టర్ కుటుంబ సభ్యులు 100కు ఫోన్ చేసి తమ ఇంటిపై కొందరు దౌర్జన్యానికి యత్నిస్తున్నారని చెప్పారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని బాధితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో బాధితులు సోమవారం జోగుళాంబ గద్వాల జిల్లా కలెక్టరేట్ ముందు ఆందోళన చేపట్టారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ 'ప్రజావాణి' కార్యక్రమంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.

ఒంటరి మహిళల మెడలోని గొలుసులే టార్గెట్

11 చోట్ల చోరీలు

కాకినాడ జిల్లాకు చెందిన ఇద్దరి దొంగల అరెస్ట్

అత్తిలి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అత్తిలి తదితర ప్రాంతాల్లో గొలుసు దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్ట్ చేసినట్టు తణుకు రూరల్ సీఐ బి.కృష్ణమోహన్, అత్తిలి ఎస్ఐ పి.ప్రేమరాజు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి పోలీస్ స్టేషన్లో సీఐ మాట్లాడుతూ కాకినాడ జిల్లా సామర్లకోట మండలం పవర గ్రామానికి చెందిన అనుబోయిన నాని బాబు, పనసపాడు గ్రామానికి చెందిన బొమ్మరాజులను అరెస్టు చేసినట్లు తెలిపారు. ఒంటరిగా ఉన్న మహిళల మెడలోని గొలుసులు చోరీ చేసి ఎత్తుకెళ్లడం వీరి నైజమని అన్నారు. తుని, అన్నవరం, రాజోలు, రావులపాలెం, అత్తిలి, ఇరగవరం, తణుకు తదితర ప్రాంతాలలో 11 చోట్ల దొంగతనాలు చేసినట్లు తెలిపారు. అత్తిలి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి వద్ద మహిళ మెడలో గొలుసు దొంగిలించి పారిపోతుండగా మంచిలి గ్రామం వద్ద అరెస్టు చేసినట్టు తెలిపారు. వారి నుంచి 223 గ్రాముల బంగారం, మారుతి కారును స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. నిందితులను తణుకు కోర్టులో హాజరుపర్చగా 14 రోజులు రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. ఈ కేసులో కానిస్టేబుల్ ఎస్.కె.అన్వర్, మలక శ్రీనివాస్, వై.శివకృష్ణ సహకరించినట్టు వారు తెలిపారు.

గంధం చెట్లు నరికిన ముగ్గురు మధ్యప్రదేశ్ వాసుల అరెస్ట్

రూ.10,25,000 విలువైన చెట్టు మానులు స్వాధీనం


రాజానగరం పోలీస్ స్టేషన్‌లో నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసన్న వీరయ్య గౌడ్

రాజానగరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం నందరాడలోని ఒక తోటలో గంధం చెట్లు నరికిన దొంగలను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం రాజానగరం పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ నిందితుల వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన తస్నీరు విజయకుమార్‌కు రాజానగరం మండలం నందరాడ గ్రామంలో 12 ఎకరాల పొలం ఉంది. ఈ పొలంలో కొబ్బరి, మామిడి, టేకు, ఎర్ర చందనం, శ్రీగంధం చెట్లను పెంచుతున్నారు. సదరు తోటలో దొడ్డా సోమేశ్వరరావు సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఈనెల 16న సోమేశ్వరరావు పొలం పనులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వెళ్లిపోయాడు. 19న ఉదయం తోటమాలి పిన్నమరాజు సత్యనారాయణ తోటలోకి వెళ్లి చూడగా తోటలో ఉన్న 2 గంధపు చెట్లను ఎవరో నరికి తీసుకెళ్లడం గమనించి సోమేశ్వరరావుకు ఫోన్‌లో సమాచారం అందించాడు. దీంతో సోమేశ్వరరావు తోటలోకి వెళ్లి చూడగా గంధం చెట్టు నరికేసి అపహరించినట్లుగా గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గంధం చెట్లను మొదలకు కోసి చెట్టు చివరి భాగం వదిలిపెట్టి మొదలు భాగాన్ని ముక్కలుగా నరికి దొంగిలించారు. ఈ మేరకు సీఐ ఎస్.ప్రసన్న వీరయ్య గౌడ్ పర్యవేక్షణలో ఎస్.ఐ ప్రియకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మధ్యప్రదేశ్ నుంచి వచ్చి సంచార జీవనం చేస్తున్న వ్యక్తులను అనుమానితులుగా గుర్తించి ఈ నెల 21న దివాన్ చెరువు సమీపంలో పట్టుకుని విచారించారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కట్ని జిల్లాకు చెందిన జాలిస్ ఆదివాస్, శివరాజ్ ఆదివాసీ, ఉల్లిష్ అలియాస్ టీటూ అనే ముగ్గురుని పట్టుకుని విచారించగా నేరం అంగీకరించడంతో అరెస్టు చేశామన్నారు. నిందితుల నుంచి గంధం చెట్ల మాను ముక్కలను స్వాధీనం చేసుకున్నామని, వాటి విలువ రూ.10,25,000 ఉంటుందన్నారు.

ఆ లేఖతో మాకు సంబంధం లేదు

మావోయిస్టు పార్టీ డివిజన్ కార్యదర్శి లచ్చన్న ప్రకటన


భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)
భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ
పత్రికా ప్రకటన
తేదీ : 22-సెప్టెంబర్-2025

మావోయిస్టుల పేరిట విడుదలైన లేఖ

చింతూరు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో ఇటీవల మావోయిస్టుల పార్టీ పేరిట విడుదలైన లేఖతో తమకు ఎటు వంటి సంబంధం లేదని మావోయిస్టు పార్టీ డివిజన్ కమిటీ కార్యదర్శి లచ్చన్న సోమవారం ఖండించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం-అల్లూరి సీతారామరాజు డివిజన్ కమిటీ పేరిట విప్లవ సంతకంతో ఓ లేఖ విడుదలైందన్నారు. ఆ లేఖలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల, దుమ్ముగూడెంకు చెందిన పలువురి రాజకీయ నాయకులు, ఓ పత్రికా విలేకరిని కూడా హెచ్చరించడం జరిగిందని లచ్చన్న పేర్కొన్నారు. ఇదంతా కొంతమంది పని గట్టుకుని చేస్తున్న దుష్ప్రచారమని, ఏజెన్సీలో గందరగోళం సృష్టించేందుకే ఈ తరహా ప్రకటనలు విడుదల చేస్తున్నారని మండిపడ్డారు.

ఇసుక దొంగతనం చేసిన ఇద్దరిపై కేసు

కొవ్వూరు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): నమ్మించి ఇసుక దొంగతనం చేసిన ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరానికి చెందిన గూడపాటి రాజశేఖర్ తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కుమారదేవంలో ప్రభుత్వం మంజూరు చేసిన దుర్గా వెంకటరమణ సాండ్ ట్రేడర్స్ ద్వారా ఓపెన్ ఇసుకర్యాంపు నుంచి ఇసుక తీసుకువచ్చి స్టాక్ పాయింటులో నిల్వ చేసి అక్కడ నుంచి విశాఖ, అనకాపల్లి జిల్లాలలోని ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్‌కు ఇసుక సరఫరా చేస్తున్నాడు. స్టాక్ పాయింటు వద్ద భీమవరానికి చెందిన కునిపూడి శ్రీనివాస్ అలియాస్ చిరుత శ్రీనుని ఏపీ ప్రభుత్వ హౌసింగ్ కార్పొరేషన్ ర్యాంపులో గుమస్తాగా నియమించింది. ఈ నేపథ్యంలో శ్రీనివాస్ తన అల్లుడైన పంపన గణపతికి సొంత లారీలు ఉన్నాయని చెప్పి రాజశేఖర్‌కు పరిచయం చేసి ఇసుక రవాణాకు నియమించాడు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటలకు స్టాక్ పాయింటు మూసి వేసిన తరువాత ఇద్దరు కలిసి సుమారు 196 ట్రిప్పులు రూ.6,47,881.92లు విలువైన ఇసుకను మోసగించి స్టాక్ పాయింటు నుంచి దొంగతనంగా తరలించారు. అంతేకాకుండా ఇసుక రవాణా నిమిత్తం రాజశేఖర్ వద్ద రూ.8లక్షలు అడ్వాన్సుగా తీసుకున్నాడు. పంపన గణపతి కుటుంబ అవసరాల నిమిత్తం లారీని దస్తావేజు అగ్రిమెంటు చేసుకుని మరో రూ.15 లక్షలు తీసుకున్నాడు. లారీని ఫిర్యాదుపేరుపై రిజిస్ట్రేషన్ చేయకుండా రాత్రి సమయంలో లారీని ర్యాంపు నుంచి నవాబుపాలెం తీసుకువెళ్లిపోయాడు. మొత్తం రూ.30 లక్షల వరకు మోసగించినట్టు ఇద్దరిపై రాజశేఖర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీహరిరావు పేర్కొన్నారు.

బోనాల సంబరం


రౌతులపూడిలో బోనాలతో ఆలయానికి వస్తున్న మహిళలు




తునిరూరల్: ఎన్.సూరవరం గ్రామంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

రౌతులపూడి/ తునిరూరల్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రౌతులపూడిలో దుర్గాదేవి అమ్మవారు బాలత్రిపుర సుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి అధిక సంఖ్యలో మహిళలు బోనాలు సమర్పించారు. అలాగే తుని మండలం ఎన్.సూరవరం గ్రామంలో కూడా బోనాల సంబరం జరిగింది. టీడీపీ మండలాధ్యక్షుడు చింతమనీడి నాగ సోమరాజు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించగా మహిళలు బోనాలను శిరస్సును ధరించి గ్రామ పురవీధుల్లో ప్రదర్శన చేశారు.

గ్యాస్ పైపులైన్ లీకేజీ

గుర్తించిన రైతులు... అప్రమత్తమైన అధికారులు


కె.పెదపూడిలో గ్యాస్ లీకేజీ దృశ్యం

అంబాజీపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలం కె.పెదపూడి- కొత్తపాలెం వద్ద ఉన్న అప్పర్ కౌశిక గట్టుపై సోమవారం ఓఎన్జీసీకి చెందిన గ్యాస్ పైపులైన్ స్వల్పంగా లీకైంది. వ్యవసాయ పనుల నిమిత్తం ఆటుగా వెళ్లే రైతులు కొంత మంది గ్యాస్ లీకేజీని గుర్తించి అధికారులకు సమాచారం అందించారు. అప్రమత్తమైన అధికారులు లీకేజీ విషయాన్ని ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించగా అయినవిల్లి మండలం మడుపల్లి నుంచి మామిడికుదురు మండలం పాశర్లపూడి వెళ్తున్న పైపులైన్ లీకేజీని గుర్తించి అరికట్టారు. స్థానికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

లారీని ఢీకొన్న బైక్.. యువకుడి మృతి

మరొకరికి గాయాలు

దివాన్‌చెరువు వద్ద ఘటన

దివాన్‌చెరువు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై తూర్పుగోదావరి జిల్లా దివాన్‌చెరువు జీరో పాయింట్ వద్ద జరిగిన ప్రమాదంలో రాజమహేంద్రవరం మోడల్ కాలనీకి చెందిన బత్తుల తారకరాజు (27) మృతిచెందాడు. బొమ్మూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి తారకరాజు స్నేహితులతో కలసి రాజానగరం వైపు నుంచి లాలాచెరువు వైపునకు మూడు బైక్‌లపై వెళ్తున్నారు. స్థానిక జీరోపాయింట్ వద్ద తారకరాజు ప్రయాణిస్తున్న వాహనాన్ని అతడి స్నేహితుడు పల్లా గోపినాథ్ నిర్లక్ష్యంగా నడిపి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన తారకరాజు అక్కడికక్కడే మృతిచెందగా గోపీనాథ్‌కు గాయాలయ్యాయని బొమ్మూరు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదానికి సంబంధించి మృతుడి బంధువులు సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు పేర్కొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం


లభ్యమైన మృతదేహం

నిడదవోలు, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీ మొదటి వీధిలో సోమవారం దాదాపు 45 ఏళ్ల వయసు గల గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బహుశా అనారోగ్య సమస్యలతో మృతి చెంది ఉండవచ్చని స్థానికులు భావిస్తున్నారు. దీనిపై అనుమానాస్పద మృతికేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగన్మోహనరావు తెలిపారు.

'మత్స్యకార సమస్యలపై సమష్టి పోరాటం'

కొత్తపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలంలోని ఉప్పాడ, అమీనబాద్ తీర ప్రాంతాలకు చెందిన మత్స్యకార నాయకులు తమ సమస్యలపై సమష్టి పోరాటం చేసేందుకు సోమవారం సమావేశమయ్యారు. తీరప్రాంతాల్లో నెలకొల్పిన రసాయన పరిశ్రమల కారణంగా సముద్రంలో మత్స్య సంపద లభ్యం కాకపోవడంతో తమకు జీవనోపాధి పోయిందని ఆవేదన చెందారు. సుమారు 500మంది మత్స్యకారులు ఉప్పాడ నుంచి కాలినడకన కొత్తపల్లి పోలీసు స్టేషన్‌కు వచ్చి ఉప్పాడ- అమీనబాద్ బీచ్ రోడ్డులో మంగళవారం తలపెట్టిన ఆందోళనకు అనుమతి ఇవ్వాలని ఎస్ఐ జి.వెంకటేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఉమ్మిడి జాన్, నక్కా మణికంఠ, సూరాడ ఎల్లాజీ, చోడిపల్లి ప్రసాద్, సూరాడ రాజు, మేరుగు భూషణం, ఓసిపల్లి అప్పన్న, గంటా విజయకుమార్ పాల్గొన్నారు.

తిరుపతి-విశాఖ మధ్య 20 ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు

సామర్లకోట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తిరుపతి-విశాఖ మధ్య సామర్లకోట మీదుగా ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని రైల్వే ఉన్నతాధికారులు నవంబరు 25 వరకూ 20 వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడుపనున్నట్టు ప్రత్యేక ఉత్తర్వుల ద్వారా వెల్లడించారు. ఈ మేరకు సామర్లకోట రైల్వే ఉన్నతాధికారులకు అందిన సమాచారం ఇలా ఉంది.

08584 నంబరు గల రైలు తిరుపతి-విశాఖపట్నం మధ్య నవంబరు 25 వరకూ ప్రతీ మంగళవారం తిరుపతిలో రాత్రి 9.50 గంటలకు బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 10 ట్రిప్‌లుగా నడువనుంది. అలాగే 08583 నంబరు గల రైలు విశాఖపట్నం-తిరుపతి మధ్య నవంబరు 24 వరకూ ప్రతీ సోమవారం తిరుపతిలో రాత్రి 7.10 గంటలకు బయలుదేరనుంది. ఈ ప్రత్యేక రైలు 10 ట్రిప్‌లుగా నడువనుంది. 08583 నంబరు గల ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు విశాఖపట్నంలో ప్రతీ సోమవారం రాత్రి 7.10 గంటలకు బయలుదేరుతుంది. దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, అన్నవరంనకు రాత్రి 9.35 గంటలకు చేరుతుంది, సామర్లకోటకు రాత్రి 10.02కి చేరుతుంది. రాజమహేంద్రవరానికి రాత్రి 10.52 గంటలకు చేరుతుంది. నిడదవోలు, తణుకు, భీమవరం, ఆకివీడు, కైకలూరు, గుడివాడ, విజయవాడ, చీరాల, ఒంగోలు, నెల్లూరు, గూడూరు జంక్షన్, శ్రీకాళహస్తి, రేణిగుంటల మీదుగా తిరుపతికి మరుసటి రోజు మంగళవారం ఉదయం 10.12 గంటలకు చేరుతుంది. ఈ ప్రత్యేక వారాంతపు ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబరు 23, 30 అక్టోబరు 7, 14, 21, 28 నవంబరు 4, 11, 18, 25 తేదీలలో విశాఖపట్నం నుంచి 10 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది.

08584 నంబరుగల తిరుపతి-విశాఖపట్నం మధ్య వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతిలో ప్రతీ మంగళవారం రాత్రి 9.50 గంటలకు బయలుదేరుతుంది. రేణిగుంట, శ్రీకాళహస్తి, గూడూరు, నెల్లూరు, ఒంగోలు, చీరాల, తెనాలి, విజయవాడ, గుడివాడ, కైకలూరు, ఆకివీడు, భీమవరం, నిడదవోలు మీదుగా రాజమహేంద్రవరానికి ఉదయం 6.43 గంటలకు, సామర్లకోటకు 7.28, అన్నవరానికి 7.53 గంటలకు చేరుతుంది. యలమంచలి, అనకా పల్లి, దువ్వాడల మీదుగా విశాఖపట్నం బుధవారం ఉదయం 10.15 గంటలకు చేరుతుంది. ఈ వారాంతపు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైలు సెప్టెంబరు 22,29 అక్టోబరు 6,13,20,27 నవంబరు 3,10,17,24లలో 10 ట్రిప్‌లుగా బయలుదేరుతుంది.

సెంట్రల్ జైలు ఖైదీ పరారీ


ప్రభాకర్ (ఫైల్)

దేవరపల్లి, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరం సెంట్రల్ జైలు నుంచి వాయిదా నిమిత్తం విజయవాడ తీసుకెళ్లి తిరిగి రాజమహేంద్రవరం తీసుకొస్తున్న సమయంలో ఖైదీ బత్తుల ప్రభాకర్ పరారయ్యాడు. దేవరపల్లి మండలం దుద్దుకూరు జాతీయ రహదారి పక్కనున్న గోదావరి రెస్టారెంట్ వద్ద టిఫిన్ చేసేందుకు సోమవారం రాత్రి ఎస్కార్ట్ వ్యాను ఆగింది. ఇదే అదునుగా భావించిన ప్రభాకర్ మూత్ర విసర్జన కోసం తీసుకెళ్లమని అడిగి తప్పించుకుని పరారయ్యాడు. దీనిపై దేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ప్రభాకర్ కోసం గాలిస్తున్నామని, పోలీసుల నుంచి తప్పించుకున్న సమయంలో చేతికి సంకెళ్లు, వైట్ కలర్ టీషర్టు, బ్లాక్ కలర్ ట్రాక్‌ను ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు 9440796584, 9440796624 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఆచూకీ తెలిపిన వారికి తగిన పారితోషికం అందజేస్తామన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్ట్

రాయవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): గంజాయి కేసులో నిందితుడిగా ఉండి పరారీలో ఉన్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్టు రాయవరం ఎస్ఐ డి.సురేష్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం.. గంజాయి కేసులో ఏ6 నిందితుడిగా ఉన్న మందపల్లి డానియేల్ ఈ ఏడాది ఏప్రిల్ నుంచి పరారీలో ఉన్నాడు. మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు పర్యవేక్షణలో రాయవరం పోలీసులు డానియేల్‌ను సోమవారం కోనసీమ జిల్లా మండపేట బైపాస్ రోడ్డు సమీపంలో బోర్డు స్కూల్ రోడ్డులో అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపరిచినట్టు ఎస్ఐ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని కోరారు.

బాలికలకు ప్రత్యేక హోం

అమలాపురంరూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): బాలికలఅక్రమ రవాణాను అరికట్టడం, వారికి ధైర్యాన్ని ఇచ్చేందుకు మిషన్ వాత్సల్యలో భాగంగా తారకరామ నగర్‌లో స్పెషల్ నీడ్ చిల్డ్రన్ బాలికల హోంను డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి సోమవారం ప్రారంభించారు. మరో విభాగాన్ని సర్పంచ్ దానరిఅరుణ ప్రారంభించారు.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

- విద్యుత్ దీపాలతో ఆలయాలు అలంకరణ
- గ్రామాల్లో అమ్మవారి విగ్రహాల ప్రతిష్ఠలు
- అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు






ముమ్మిడివరం పళ్లవారిపాలెంలోని శ్రీవిజయదుర్గమ్మ, ఉప్పలగుప్తం: ఎస్.యానాంలో శ్రీప్రసన్నాంభికాదేవి, అంతర్వేదిలో ప్రత్యేక అలంకరణలో శ్రీకనకదుర్గమ్మ, పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో శ్రీబాలాత్రిపుర సుందరిదేవిగా శ్రీకనకదుర్గమ్మ

అమలాపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణంలోని శ్రీదేవి మార్కెట్‌లో ఉన్న శ్రీదేవి అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో అమ్మవారిఆలయంలో పూజా కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అమలాపురం పట్టణ పోలీసు లైనులో ఉన్న వేపచెట్టు కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయం వద్ద మున్సిపల్ ప్రతిపక్ష నేత యేడిద శ్రీను దంపతులు పూజలో కూర్చుని ఉత్సవాల ప్రారంభానికి శ్రీకారంచుట్టారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొనడంతో పాటు జనసేన, ఇతర పార్టీల నాయకులు వేపచెట్టు కనకదుర్గమ్మవారిని దర్శించుకున్నారు. అమలాపురంలోని శ్రీవెంకటేశ్వర స్వామిఆలయం వద్ద గల శ్రీకనకదుర్గమ్మవారిని బాలాత్రిపురసుందరిదేవిగాఅలంకరించి భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మార్కెట్ వద్ద, ఆదిత్యకళాశాల పక్కనున్న అమ్మవారి ఆలయాల్లో విశేషపూజలు, అలంకరణలుచేశారు. తొలిరోజు పలుచోట్ల అన్నసమారాధనలు చేశారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రతీగ్రామంలో కనకదుర్గమ్మవారి ఆలయాన్ని, అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామాల్లోని ముఖ్య కూడళ్లలో చలువ పందిళ్లు ఏర్పాటుచేసి అమ్మవారి ఉత్సవ విగ్రహాలు ఏర్పాటుచేసి కలశస్థాపనచేసి ఉత్సవాలు ప్రారంభించారు. సోమవారం అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ముమ్మిడివరం మెయిన్‌రోడ్డు, కుమ్మర్లవీధి, రాజుపాలెం, గోదశివారిపాలెం, క్రాపచింతలపూడి, సోమిదేవరపాలెం, అయినాపురం, చినకొత్తలంక, పళ్లవారిపాలెం, లక్ష్మీదేవిలంక, ఠాణేలంక గ్రామాల్లో దసరాఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ముమ్మిడివరంలోని ఈశ్వరమ్మ ఆలయంలోని విజయదుర్గమ్మవారికి విళ్ల ఈశ్వరరావు దంపతులు, విళ్ల గణేష్ దంపతుల ఆధ్వర్యంలో కలశస్థాపన నిర్వహించి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరిపించారు. చినకొత్తలంకలో శ్రీపట్టాభిరామస్వామి వారి ఆలయంలో విజయదుర్గమ్మ వారు మొదటిరోజు సోమవారం బాలాత్రిపురసుదరిదేవిగా అమ్మవారిని అలంకరించి పూజలు జరిపించారు. ముమ్మిడివరంలోనివాసవికన్యకాపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. మహిళలు కలశలను శిరస్సున ధరించి ఊరేగింపుగా తరలివచ్చి కలశస్థాపన నిర్వహించి శరన్నవరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి శుభ ముహూర్తాన మండలంలోని పలు గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభించారు. అప్పనపల్లి శ్రీబాలబాలాజీస్వామి సన్నిధిలో శ్రీమహాలక్ష్మి అమ్మవారికి చక్రార్చన, పంచామృతాలతో అభిషేకం, శ్రీమహాలక్ష్మి యాగం, సామూహిక కుంకుమార్చన, లలితా సహస్ర పారాయణాలు, పలు పూజలను ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు. పెదపట్నంలంక కనకదుర్గమ్మవారు ఉత్సవాల్లో మొదటి రోజు శైలపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పాశర్లపూడి బాడవలోని కనకదుర్గమ్మ వారి ఆలయంలో శత చండీయాగ సహిత లక్ష కుంకుమార్చన, లక్ష బిల్వార్చన తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మామిడికుదురులోని శ్రీవిజయదుర్గమ్మవారిని లక్ష చామంతులతో సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. నగరం, మగటపల్లి, బి.దొడ్డవరం, గోగన్నమఠం, ఈదరాడ తదితర గ్రామాల్లో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఆయా కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అయినవిల్లి, (ఆంధ్రజ్యోతి): ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి సందర్భంగా దేవీ శరన్నవరాత్రి పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అమ్మవారి ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా తీర్చిదిద్దారు. తొలిరోజు అమ్మవారు బాలాత్రిపురసుందరిదేవిగా దర్శనం ఇచ్చారు. అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు, ప్రత్యేకాలంకరణలు, అర్చనలు నిర్వహించారు. కనకదుర్గామాత ఆలయంలో లలితా సహస్రపారాయణం, కుంకుమార్చనలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారి ఆలయాలకు పోటెత్తారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామివారి అనుబంధ దేవాలయం స్వామివారి సోదరి అశ్వరూడాంబిక (గుర్రాలక్క) అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలుత అర్చకులు శాస్త్రోక్తంగా లక్ష్మీనరసింహస్వామివారి ఆలయం తరపున సోదరి అశ్వరూడాంబిక అమ్మవారికి చీర, సారె సమర్పించి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతీరోజు కుంకుమ పూజలు జరుగుతాయని సహాయ కమిషనర్ ఎంకేటీఎన్వీ ప్రసాద్ తెలిపారు. అంతర్వేది భవానీ సెంటర్, దిండకొడప, కేశవదాసుపాలెం, మోరి, మోరిపోడు, సఖినేటిపల్లి, సఖినేటిపల్లిలంక, రామేశ్వరం, గొంది తదితర గ్రామాల్లో ఘనంగా దసరా ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఆలయాల వద్ద భక్తులు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాలను విద్యుత్ అలంకరణలతో ముస్తాబు చేశారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో ప్రధాన కూడళ్లలో అమ్మవారి విగ్రహాలను ప్రతిష్ఠించారు. సోమవారం ఉదయం కలశ స్థాపన అనంతరం పూజలు, అర్చనలు జరిపారు. గ్రామాల్లో నవరాత్రుల సందడి నెలకొంది.మోరిలో కనకమహాలక్ష్మమ్మ ఆలయంలో సొసైటీ అధ్యక్షుడు బళ్ల రాము-దేవిదంపతులు కలశస్థాపన చేసి పూజలు నిర్వహించారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): గ్రామగ్రామాన శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బాలాత్రిపురసుందరిగా దుర్గాదేవిని అలంకరించి తొలిరోజు నవరాత్రి పూజలు నిర్వహించారు. మంగళవాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఉత్సవాలను వేదమంత్రోచ్చారణతో ప్రారంభించారు. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. వానపల్లిపాలెంలోభారీఅన్నసమారాధననిర్వహించారు. ఎస్.యానాం శ్రీప్రసన్నాంబికా ఆలయం వద్ద నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామ గ్రామాన దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని దుర్గాదేవి ఆలయాల వద్ద మొదటి రోజున దుర్గా, చండీ హోమాలు, కుంకుమ పూజలతో ఉత్సవాలు ప్రారంభించారు. బెండమూర్లంకలో విజయదుర్గ ఆలయం వద్ద గుత్రం నాగేశ్వరరావు-కృష్ణకుమారి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. అల్లవరం దుర్గాదేవి ఆలయం వద్ద చండీహోమం, అన్నసమారాధనలకు భక్తులు పోటెత్తారు. కాకిలేటి సాయిబాబు దంపతులు కర్తలుగా పెద్దింటి కృష్ణ ఆధ్వర్యంలో దుర్గా చండీహోమం, ప్రత్యేక పూజలు జరిగాయి. కొమరగిరిపట్నం, బెండమూర్లంక, ఓడలరేవు, గోడితిప్ప, మొగళ్లమూరు, గోడిలంక, దేవగుప్తం, కోడూరుపాడు, బోడసకుర్రు, యెంట్రుకోన తదితర గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా అమ్మవార్లకు కుంకుమ పూజలు జరిగాయి.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): శ్రీదేవీ నవరాత్రి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. అమ్మవారి ఆలయాల్లో కలశస్థాపన చేసి అమ్మవార్లకు పూజలు నిర్వహించారు. పి.గన్నవరం శివారు తాటికాయలవారిపాలెంలో ఉన్న శ్రీకనకదుర్గమ్మ అమ్మవారు శ్రీబాలాత్రిపుర సుందరీదేవిగా దర్శనమిచ్చారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వ హించారు. అనంతరం భారీ అన్నసమారాధన జరిగింది. మొండెపులంక, మానేపల్లి, ముంగండ, లంకలగన్నవరం, పి.గన్నవరం, నరేంద్రపురం, ఊడిమూడి, గంటిపెదపూడి, బెల్లంపూడి, కె.ముంజవరం, ముంగండపాలెం, రాజులపాలెం తదితర గ్రామాల్లో అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మవారి ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారి కలశస్థాపన చేసి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. అంబాజీపేట బస్టాండ్ వద్ద ఉన్న శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అంబాజీపేట సంతమార్కెట్‌లో ఉన్న శ్రీవిజయకనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. మండలంలోని పలు ఆలయాల్లో శరన్నవరాత్రి ఉత్స వాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారి కలశ స్థాపనలు నిర్వహించారు.

యానాం, (ఆంధ్రజ్యోతి): యానాం శివారు గిరియాంపేట రోడ్డులోని శ్రీపాల కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు రాయప్రోలు కామేశ్వరశర్మ ఆధ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు శ్రీపాలకనకదుర్గాదేవిగా దర్శనమిచ్చారు. పడవలరేవు వీధిలోని లలితాదేవి ఆలయంలో అమ్మవారు, గోపాల్‌నగర్‌లోని శారదాదేవి(సరస్వతి)ఆలయంలో అమ్మవారు, శివాలయ ప్రాంగణంలోని శ్రీవాసవీ కన్యాకపరమేశ్వరి అమ్మవార్లు బాలాత్రిపుర సుందరి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా పలు ఆలయాల్లో ప్రభుత్వ డిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి సతీమణి ఉదయలక్ష్మి అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.






అల్లవరం:బెండమూర్లంకలో విజయదుర్గమ్మ, అంబాజీపేటలో అలంకరణలో వాసవీమాత, యానాం:పాలకనకదుర్గ అమ్మవారు, అమలాపురం: శ్రీదేవిమార్కెట్‌లో బాలాత్రిపురసుందరిదేవిగా అలంకరణ

వీఆర్‌ఏలకు పేస్కేలు వర్తింపచేయాలి



ధర్నాచౌక్‌లో వీఆర్‌ఏల ధర్నాను ఉద్దేశించి మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు బాపూజీ

అమలాపురం టౌన్, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): వీఆర్‌ఏలకు ఇచ్చిన హామీలు కూటమి ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపిస్తూ ఏపీ గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం జిల్లా శాఖ ఆధ్వర్యంలో సోమవారం అమలాపురం నల్ల వంతెన వద్ద ధర్నాచౌక్‌లో ధర్నా నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వీఆర్‌ఏలు తరలివచ్చి ధర్నాలో పాల్గొన్నారు. వీఆర్‌ఏలకు తెలంగాణ తరహాలో పేస్కేలు వర్తింపచేయాలని, అర్హత కలిగిన వీఆర్‌ఏలను వీఆర్వోలుగా పదోన్నతులు కల్పించాలని ప్లకార్డులు చేతబూని నిరసన తెలిపారు. వీఆర్‌ఏల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు డి.వీరభద్రరావు, ఉపాధ్యక్షుడు ఎం.సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నా శిబిరంలో వారు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ధర్నా శిబిరాన్ని రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందించారు. నిరసనలో అమలాపురం డివిజన్ సంఘ అధ్యక్షుడు కర్రి త్రినాథ్, కొత్తపేట డివిజన్ సంఘ అధ్యక్షుడు జి.ఆంజనేయులు, బీవీ సత్యనారాయణ, ఉందుర్తి అంజనరావు, సీహెచ్ వీరబాబు, పలివెల నాగేశ్వరరావు, బాబ్జితో పాటు 16 మండలాల వీఆర్‌ఏలు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల బంద్ విజయవంతం



బంద్‌లో పాల్గొన్న అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు నరసింహారావు తదితరులు

అమలాపురం టౌన్, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆర్టీఎఫ్‌లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర ప్రైవేటు డిగ్రీ కళాశాలల అసోసియేషన్ పిలుపు మేరకు చేపట్టిన బంద్ జిల్లాలో విజయవంతమైనట్టు ఏకేఎన్‌యూ కాలేజెస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కేవీఆర్‌ఎన్ నరసింహారావు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రైవేటు డిగ్రీ కళాశాలలు స్వచ్ఛందంగా మూసివేసి బంద్‌లో పాల్గొన్నాయన్నారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేసి డిగ్రీ కళాశాలలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేఎస్‌వీఎస్ మనోహర్, యాలంగి వరప్రసాద్, కరాటం ప్రవీణ్, చోడే జాన్‌పాల్, మద్దింశెట్టి రాంబాబు, కె.సీతామహాలక్ష్మి, కె.దివ్య, నీలి సంసోను పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ ఉపసంహరించాలి



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు సుబ్బారావు

అమలాపురంటౌన్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పలువురు వక్తలు డిమాండ్ చేశారు. అమలాపురం సీఐటీయూ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశానికి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావుహాజరై మాట్లాడుతూప్రభుత్వ రంగంలోనే విద్య, వైద్యం, ప్రజారోగ్యాన్ని కొనసాగించాలన్నారు. సీపీఎం జిల్లా కన్వీనర్ సమావేశానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ప్రభుత్వ రంగంలోనే వైద్యవిద్య ఉండాలన్నారు. సమావేశంలో వివిధప్రజాసంఘాలనాయకులు ఎ.రవి, పి.పవన్‌శివప్రసాద్, శివారెడ్డి, ఇక్బాల్, రేవు తిరుపతిరావు, వడ్డి నాగేశ్వరరావు, శెట్టిబత్తుల తులసీరావు, శ్రీనివాసరావు, పీఎన్ వెంకటేశ్వర్లు, వీఎన్ శివకుమార్, జీవీ రమణ, కొంకి రాజామణి, గుడే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, టి.నాగవరలక్ష్మి, పి.అమూల్యపాల్గొన్నారు.

పాలసీలపై జీఎస్టీ రద్దుపై హర్షం

అమలాపురంరూరల్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): బీమాపాలసీలపై జీఎస్టీని రద్దుచేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి హర్షం వ్యక్తంచేస్తూ ఏవోఐ యూనియన్ అమలాపురం శాఖ అధ్యక్షుడు సానబోయిన వీరభద్రరావు ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు. ఎల్ఐసీకార్యాలయం వద్ద కేక్ కట్‌చేసి ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జీఎస్టీ రద్దు చేయడంతో అందరికీ స్వీట్లు పంచారు. ఎల్ఐసీ బ్రాంచి మేనేజర్ సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ బ్రాంచి మేనేజర్ మధుబాబు, శేషగిరి, చక్రవర్తి, రమేష్‌బాబు, ఆర్కే అర్జున్, ఎస్.శ్రీహరి, గుమ్మలూరి వినాయకరావు, దొమ్మేటి శివస్వామి, అయినవిల్లి నాగేంద్రకుమార్, ఎల్‌వీవీ లక్ష్మి, బి.గోవిందుశెట్టి, కె.మురళీ పాల్గొన్నారు.

రేపు ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

పి.గన్నవరం, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): పి.గన్నవరం సామాజిక ఆరోగ్యకేంద్రం (సీహెచ్‌సీ)లో బుధవారం ఉచితంగా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ యు.రాఘ వేంద్రరావు తెలిపారు. స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. స్త్రీలకు సంబంధించి రక్తపోటు, మధుమేహం పరీక్షలు,నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్లకు సంబంధించి ఉచితంగా స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు.

4న సత్రం ప్రారంభం

మలికిపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీశ్రీనివాసా ఉమారామలింగేశ్వర నిత్యాన్నదాన దేవాంగ సత్రం అక్టోబరు 4న ప్రారంభిస్తున్నట్టు కమిటీ సభ్యుడు చింతా వీరభద్రేశ్వరరావు తెలిపారు. రూ.40కోట్లతో 102గదులతో సత్రం నిర్మాణం చేపట్టారు. మొదటి బ్లాక్ పూర్తికావడంతో ప్రారంభోత్సవం ఏర్పాటు చేశారు. ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌కు అందించారు.రాష్ట్ర దేవాంగ సంఘ నాయకుడు చింతా వీరభద్రేశ్వరరావు, దేవాంగ సంఘం కోనసీమ ఉపాధ్యక్షుడు కటకం ధనలక్ష్మీశ్వరరావు, శ్రీశైలం దేవాంగ సత్రం కమిటీ సభ్యులు చింతా నరసింహారావు పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గింపును స్వాగతిస్తున్న ప్రజలు



మలికిపురంలో ప్రధాని మోదీ చిత్ర పటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

మామిడికుదురు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబ్‌ను తగ్గిస్తూ తీసుకున్న నిర్ణయాన్ని దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని, బీజేపీ నాయకులు పేర్కొన్నారు. జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని స్వాగతిస్తూ బీజేపీ నాయకులు మామిడికుదురు బస్టాండు కూడలిలో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ, కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చిత్ర పటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు భైరిశెట్టి దుర్గారామకృష్ణ, నాయకులు మెండా ఆదినారాయణ, కంకిపాటి సుబ్బారావు, కటికిరెడ్డి తమ్మయ్యనాయుడు, నక్కా త్రిలోచనరావు, పసుపులేటి మహాలక్ష్మిరావు, కోటిపల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): గొంది గ్రామంలో ప్రధాని నరేంద్ర మోదీ చిత్రపటానికి బీజేపీ శ్రేణులు పాలాభిషేకం చేశారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకంచేశారు. జీఎస్టీ తగ్గింపు గొప్ప పండుగరోజని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మాలే శ్రీనివాసనగేష్ అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు పోతురాజు సురేష్, సేవా పక్షోత్సవాల కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పట్టాపు సూర్యప్రకాశరావు, బోనం నాయుడు, రావూరి బాబ్జి, వాస్కూరి వెంకటేశ్వరరావు, పోతురాజు గణపతి, పడాల శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభించిన నూతన జీఎస్టీ విధానానికి అభినందనలు తెలియచేస్తూ మలికిపురం సెంటర్‌లో బీజేపీ మండలాధ్యక్షుడు మేడిచర్ల చాణుక్య ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. మోదీ ప్రజా నాయకుడని అభినందించారు. కార్యక్రమంలో ఇందుకూరి అచ్యుతరామరాజు, మాలే శ్రీనివాసనాగేష్, కట్టా వాసు, దొడ్డా నాగబాబు, నవీన్, గణేష్, సత్యనారాయణ, రామలింగరాజు పాల్గొన్నారు.

అల్లవరం, (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలనలో జీఎస్టీ తగ్గింపు సాహసోపేతమైన నిర్ణయమని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, మండల అధ్యక్షుడు కట్టా నారాయణమూర్తి అన్నారు. జీఎస్టీ తగ్గింపుపై అన్నివర్గాల ప్రజల నుంచిహర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయన్నారు.

అగ్నికుల క్షత్రియ నియోజకవర్గ అధ్యక్షుడిగా అంజి

అంతర్వేది, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అగ్నికుల క్షత్రియ రాజోలు నియోజకవర్గ అధ్యక్షుడిగా బర్రే అంజిని సంఘం జిల్లాగౌరవాధ్యక్షుడుకర్రి స్వామినాథ్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా నియమించినట్టు తారాడి శివ తెలిపారు. అనంతరం కోనసీమ అగ్నికుల క్షత్రియ సంఘ నూతన కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కన్వీనర్‌గా పొన్నాల జయకృష్ణ, అధికార ప్రతినిధిగా వాతాడి కొండబాబు, ప్రధాన కార్యదర్శిగా కొల్లాటి సిద్దు, వైస్‌ప్రెసిడెంట్‌గా కొప్పాడి దుర్గారావు నియమితులయ్యారు.

గ్రామాల్లో లింకు రోడ్ల ఏర్పాటుకు కృషి

మామిడికుదురు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో లింకు రోడ్ల ఏర్పాటుకు ప్రత్యేక కృషి చేస్తామని నగరం ఏఎంసీ ఛైర్మన్ పెనుమాల లక్ష్మి పేర్కొన్నారు. సోమవారం ఏఎంసీ పాలకవర్గ సమావేశం ఛైర్మన్ అధ్యక్షతన జరిగింది. ఏఎంసీ నిధులతో లింకు రోడ్లు నిర్మించాలనే ప్రతిపాదనను ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ దృష్టికి తీసుకువెళ్లి వాటి ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ గూడాల వెంకటరమణ, సర్పంచ్ జాలెం రమణకుమారి, ఏఎంసీ సెక్రటరీ జి.ప్రదీప్, సభ్యులు పాల్గొన్నారు.

వ్యాయామం నిత్యకృత్యం కావాలి

అయినవిల్లి, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వ్యాయామం చిన్ననాటి నుంచి నేర్చుకోవాలని ఎస్ఐ హరికోటిశాస్త్రి అన్నారు. ఇటీవల అమలాపురంలోని బీఆర్ ఫంక్షన్ హాలులో జరిగిన స్టేట్ లెవెల్ కరాటే పోటీల్లో విజేతగా నిలిచిన ముక్తేశ్వరం రారాజు జిమ్ అండ్ స్పోర్ట్స్ అకాడమీ విద్యార్థులు 14 మందికి ఆయన పతకాలు అందించారు. వీరిలో ఐదుగురు బంగారు, ఆరుగురు రజత, ముగ్గురు కాంస్య పతకాలు సాధించారు. వారికి సర్టిఫికెట్లు అందించి సత్కరించారు. కార్యక్రమంలో జిమ్ అండ్ కరాటే కోచ్ రారాజు, సీనియర్ కరాటే మాస్టర్లు పీవీఎస్ఎన్ వర్మ, పనస రాముడు, నేదునూరు సర్పంచ్ గుమ్మడి ప్రసాద్, జిమ్ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ

మామిడికుదురు, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మామిడికుదురు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు సోమవారం ఇంటర్న్‌షిప్ శిక్షణ ఇచ్చారు. 2025-26 విద్యా సంవత్సరంలో పీఎంసీ పథకంలో భాగంగా స్కూలులో ఏర్పాటుచేసిన వృత్తి శిక్షణ కోర్సుల్లో భాగంగా ఫుడ్ ప్రోసెసింగ్, రిటైల్, ఎలక్ట్రానిక్ కోర్సులు నిర్వహిస్తున్నారు. దసరా సెలవుల్లో విద్యార్థులకు సోమవారం మామిడికుదురులోని పలు దుకాణాల్లో శిక్షణ ఇచ్చారు. హెచ్ఎం బి.చిరంజీవిరావు, బి.సత్యనారాయణ, శిక్షణ ఉపాధ్యాయులు వై.మధు, జె.మౌనిక కృష్ణ, పి.సత్యశ్రీ తదితరులు పాల్గొన్నారు.

రూ.16కోట్లతో విద్యుత్ అభివృద్ధి పనులు

మలికిపురం,సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి):రాజోలు నియోజకవర్గంలో లోటవోల్టేజ్ సమస్య లేకుండా రూ.16కోట్లతో ఇన్సులేటెడ్ వైర్లు ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. నియోజకవర్గంలో సబ్‌స్టేషన్లకు వచ్చే హైటెన్షన్ వైర్లను ఈనిధులతో ఇన్సులేటెడ్ వైర్లగా ఆధునికీకరిస్తున్నామన్నారు. దీనివల్ల అంతరాయంలేని నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందన్నారు. 5నెలలుగా గుడిమూల సబ్‌స్టేషన్‌లో 4పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు, 10 ఫీడర్లు, 106 ట్రాన్స్‌ఫార్మర్లు, 27కిలోమీటర్లమేర కేబుల్ కండక్టర్లు ఏర్పాటు చేశామన్నారు. కొత్తగా మరో సబ్‌స్టేషన్, 200ట్రాన్స్‌ఫార్మర్లు, 150కిలోమీటర్ల కేబుల్ కండక్టర్లు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు.

ఉపాధి హామీతో కోకో సాగుకు ప్రోత్సాహం

అంబాజీపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కోకోసాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని కోకో సాగుకు అనుసంధానం చేస్తుందని ఉపాధి హామీ పథకం ఏపీడీ డి.రాంబాబు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏపీవో అడపా వెంకటకృష్ణ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో పంటను సాగు చేయాలన్నారు. మినిగోకులాలను వేగవంతంగా నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం క్షేత్రస్థాయిలో కోకో పంటను పరిశీలించారు.ప్లాంటేషన్ మేనేజర్ ఎం.త్రినాథ్, జూనియర్ ఇంజనీర్ వెంకటేశ్వరరావు, టీఏలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఘనంగా విజయభేతాళస్వామి ఉత్సవాలు ప్రారంభం



అంబాజీపేటలో చేడితాలింఖానా చేస్తున్న యువకులు

అంబాజీపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి):విజయదశమి సందర్భంగా అంబాజీపేట పెద్దవీధిలో వేంచేసియున్న శ్రీవిజయభేతాళస్వామి ఉత్సవాలు సందర్భంగా కలశస్థాపన సోమవారం వైభవంగా జరిగింది. శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమసంఘం, ఉత్సవకమిటీల ఆధ్వర్యంలో నిర్వహించే ఈఉత్సవాన్ని మాచవరందుర్గాక్షేత్రం నుంచి ప్రారంభించి పురవీధుల్లో ఊరేగించారు. స్థానికసెంటర్‌లో యువకులు ఉత్సాహంగా చేడితాలింఖానా నిర్వహించారు. కూరగాయలను కత్తులతో కట్ చేశారు. సంఘ అధ్యక్ష, కార్యదర్శులు దొమ్మేటి వెంకటరామారావు, మట్టపర్తి రాము, ఉత్సవ కమిటీ ఛైర్మన్ శీలం సత్యఅర్జునమోహనరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, నాయకులు బొంతు పెదబాబు, దొమ్మేటి శ్యామ్ పాల్గొన్నారు.

నేడు లోక్‌కల్యాణ్ మేళా

ముమ్మిడివరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం లోక్‌కల్యాణ్ మేళా పీఎం స్వనిధి 2.0 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు కమిషనర్ పి.రవివర్మ పేర్కొన్నారు. వీధి విక్రయ వ్యాపారులకు గుర్తింపు, ప్రొఫైల్ కార్డుల పంపిణీ, అర్హులైన వారందరికీ బ్యాంకు రుణ సౌకర్యం కల్పించడం, డిజిటల్ పేమెంట్‌పై అవగాహన, గుడ్ లైసెన్సు అధికారులు, హెల్త్ క్యాంపుల నిర్వహణ వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు.

మార్కెట్ కమిటీ సమావేశం

అమలాపురంటౌన్, సెప్టెంబరు22(ఆంధ్రజ్యోతి): అమలాపురం మార్కెట్ కమిటీ మూడవ సాధారణ సమావేశం ఛైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం జరిగింది. సమావేశంలో మూడు నెలలు జమా ఖర్చులు వివరాలు, చెక్‌పోస్టులు నిర్వహణ, నూతనమార్కెట్ కార్యాలయం కోసం స్థల సేకరణ, ఉప్పలగుప్తంలో కడుతున్న కొత్త గోడౌన్ల పనులు ఎంతవరకు వచ్చాయో తదితర అంశాలపై చర్చించారు. గత సమావేశంలో గౌరవ ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు సూచనల మేరకు చెక్ పోస్టులు కొన్ని మార్పు చేశామని కార్యదర్శి సవరపు మధు తెలిపారు. వైస్‌ఛైర్మన్ పరమట చిట్టిబాబు, కమిటీసభ్యులు పాల్గొన్నారు.

ఆక్వాపై అవగాహన సదస్సు

అంతర్వేది, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): సఖినేటిపల్లిలంకలో రొయ్యల చెరువులకు అప్పడచట్టం 2020, సీఏఏచట్టం 2005ప్రకారం లైసెన్సు మంజూరు విధానం గురించి ఆక్వా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ రేఖూరి రాజేశ్వరి ఏసునరసింహరాజా సభాధ్యక్షుడిగా, గౌరవాధ్యక్షుడిగా మత్స్యశాఖ సహాయ సంచాలకుడు హర్షవర్ధన్, అభివృద్ధి అధికారి సీహెచ్ గోపాలకృష్ణ, విశిష్ట అతిథులుగా జిల్లా మత్స్యశాఖ అధికారి పీవీ శ్రీనివాసరావు మాట్లాడారు.

వైద్య శిబిరాలు

ఉప్పలగుప్తం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ.. సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలు సోమవారం ఉప్పలగుప్తం, చల్లపల్లి, సూదాపాలెం గ్రామాల్లో నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఉప్పలగుప్తం పీహెచ్‌సీ వద్ద గైనకాలజిస్టు కేఎస్ హిమాని గర్భిణులు, బాలింతలను పరీక్షించారు. వైద్యాధికారి లంకే నాగార్జున ఆధ్వర్యంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు ప్రారంభించిన శిబిరంలో డాక్టర్ దివ్యజ్యోతి, సీహెచ్‌వో ఎం.విజయలక్ష్మి, హెచ్ఎస్ జి.నరసింహమూర్తి, హెచ్‌వీలు కమల, డి.నాగేశ్వరరావు, జేవీవీ సత్యనారాయణ పాల్గొన్నారు. చల్లపల్లిలో సర్పంచ్ ఇసుకపట్ల జయమణీరఘుబాబు, సూదాపాలెంలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో వైద్యాధికారులు లోవసుధ, విష్ణుప్రియ, ఎంపీహెచ్ఈవో రాయుడు రామకృష్ణమూర్తి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కంకటాల రామం, ఎంపీటీసీ నాగులపల్లి శేషవేణి పాల్గొన్నారు.

200మందికి వైద్య పరీక్షలు

పి.గన్నవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కపిలేశ్వరపురం ఎల్‌వీప్రసాద్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో అబ్దుల్‌కలామ్‌చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బీమాల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో పి.గన్నవరంలో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచ్ బొండాడ నాగమణి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్‌యు.రాఘవేంద్రరావు ప్రారంభించారు. 200మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. బీజేపీమండల అధ్యక్షుడు తిక్కా సత్తిబాబు, సీనియర్ వైసీపీ నాయకులు అడ్డగళ్ల వెంకటసాయిరాం, చీకరమిల్లి శ్రీనివాసరావు, కొక్కిరి రవికుమార్, కోట రాజేంద్రప్రసాద్, గూటం శ్రీనివాసరావు, మామిళ్లపల్లి శ్రీనివాసరావు, మైపాల తాతాజీ, టి.నాగబాబు పాల్గొన్నారు.

అన్నసమారాధన

కె.గంగవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): కె.గంగవరంలోని రైల్వే కాలనీలో సోమవారం అన్నసమారాధన జరిపారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు ముగింపును పురస్కరించుకుని నిర్వాహకులు దీన్ని జరిపారు. అధిక సంఖ్యలో ప్రజలు స్వామివారి అన్నప్రసాదంలో పాల్గొన్నారు. ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు.

నాగబాబుకు అవార్డు పట్ల హర్షం

రావులపాలెం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రావులపాడుకు చెందిన తాసా వాయిద్య కళాకారుడు కాగితపల్లి నాగబాబుకు అవార్డు లభించింది. విజయవాడలో నిర్వహించిన స్వర సప్త సంగీత సమ్మేళనంలో నాగబాబుకు తాసాలో నిర్వహించిన ప్రదర్శనలో కళానందీశ్వర అవార్డును అందుకున్నారు.

దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం



కె.గంగవరం మండలం సత్యవాడలోని చెరువు వీధిలో కొలువైన దుర్గాదేవి

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో శరన్నవరాత్రి వేడుకలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల వద్ద, ఆయా గ్రామాల్లో పందిర్లు వేసి అమ్మవారి విగ్రహాలను నెలకొల్పారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజలను ఆలయ అర్చకులు, పలువురు రుత్వికులు, వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపారు. అంగరలో దేవీ నవరాత్రుల సందర్భంగా మధ్యాహ్నం అమ్మవారి ఆలయం వద్ద భక్తులకు కుంకుమ పూజలు చేశారు. ఆయా కార్యక్రమాల్లో గ్రామస్థులతో పాటు అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు, ఉత్సవ కమిటీ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు, (ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. చింతలూరు నూకాంబిక ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలమూరు గ్రామదేవత రావులమ్మ, చింతలూరు కనకదుర్గమ్మతో పాటు ఆయా గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటుచేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

బాలా త్రిపురసుందరిదేవిగా దర్శనం

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్నవరాత్రి వేడుకలు ప్రారంభమయ్యాయి. సోమవారం ఉచ్చిలి కాలువరేవులోనున్న విజయ దుర్గాదేవిని, బాలా త్రిపుర సుందరిదేవిగా అలంకరించారు. ఆయా గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. అధిక సంఖ్యలో మహిళలు కుంకుమ పూజలు జరిపారు. వాడపల్లి, పేరవరం, రాజవరం, ర్యాలి తదితర గ్రామాల్లో భవానీ దీక్షదారులు మాలలు ధరించారు. ఆయా అమ్మవార్ల ఆలయాల వద్ద భవానీదీక్షదారులు ప్రత్యేక పూజలు చేశారు.

కె.గంగవరం, (ఆంధ్రజ్యోతి): మండలంలో శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో భక్తజనం దుర్గాదేవి ఆలయాలు, ప్రత్యేక మండపాల వద్ద అమ్మవారిని ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. తొలిరోజు అమ్మవారిని బాలా త్రిపుర సుందరిదేవిగా అలంకరించి పూజలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

పీఠంలో దేవీ శరన్నవరాత్రులు ప్రారంభం

రాయవరం, (ఆంధ్రజ్యోతి): రాయవరం మండలం వెదురుపాక విజయదుర్గా అమ్మవారు తొలిరోజు సోమవారం బాలా త్రిపురసుందరి అమ్మవారిగా పూజలందుకుంది. తొలుత విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు జరిపి ప్రత్యేకంగా అలంకరించారు. తొలుత గాడ్ కుమార్తె గాదే సత్య వెంకట కామేశ్వరి చేతుల మీదుగా ఉదయం 8.19 గంటలకు అమ్మవారి మూలవిరాట్ వద్ద కలశస్థాపన చేసి నవరాత్రి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. తెలుగు రాష్ట్రాల నుంచి వచ్చిన భక్తులు పీఠంలో కలశాలు పెట్టి అమ్మవారికి సామూహిక శ్రీచక్ర అర్చనలు చేశారు. పీఠాధిపతి గాడ్ భక్తులకు శరన్నవరాత్రి ఉత్సవాల విశిష్టత తెలిపారు. సాయంత్రం అమ్మవారికి చతుర్వేదస్వస్తి, దర్బారుసేవ, నీరాజన మంత్రపుష్పాలు, మహానివేదన జరిపారు. కార్యక్రమంలో పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు, విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కర నారాయణ, కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి, భక్తులు పాల్గొన్నారు.

ప్రజలు సుభిక్షంగా ఉండాలి

ద్రాక్షారామ, (ఆంధ్రజ్యోతి): దుర్గాదేవి అనుగ్రహంతో ప్రజలంతా సుఖ, సంతోషాలతో ఉండాలని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం ఆకాంక్షించారు. సోమవారం వెల్ల గ్రామంలో ఉన్న బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా తొలి రోజున కలశస్థాపనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో ప్రత్యేక అలంకరణలో రావులమ్మ అమ్మవారు

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): మండలంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. రావులపాలెం మండలం ఈతకోట జాతీయ రహదారి పక్కన ఉన్న కనక దుర్గమ్మ ఆలయం వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. రావులపాలెం కాలువగట్టు వద్దనున్న అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లోని అమ్మవారి ఆలయాలు, ప్రత్యేక మండపాల వద్ద శరన్నవరాత్రి వేడుకల్లో మొదటి రోజును పురస్కరించుకుని పూజలు నిర్వహించారు.



కపిలేశ్వరపురం మండలం అంగరలో ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



ఆత్రేయపురంలో ఉన్న విజయదుర్గాదేవి బాలా త్రిపురసుందరిగా దర్శనమిస్తున్న దృశ్యం



రావులపాలెంలోని ఈతకోట వద్ద పూర్ణాలంకరణలో కనకదుర్గమ్మ అమ్మవారు



రావులపాలెంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నాయకులు. పక్క చిత్రంలో ఆత్రేయపురంలో ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం జరుపుతున్న దృశ్యం

జీఎస్టీ తగ్గింపుపై హర్షాతిరేకాలు

కొత్తపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి కానుకగా జీఎస్టీ తగ్గించినందుకు ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయా ప్రాంతాల్లో సోమవారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి కూటమి నేతలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం మాట్లాడారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విశ్వ మారుతీప్రసాద్, బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ అయినవిల్లి సత్తిబాబు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, గుబ్బల మూర్తి, పాలూరి జయప్రకాశ్ నారాయణ, యెండూరి పవన్, తమ్మన సాయిప్రసాద్, కంఠంశెట్టి చంటి, కోటిపల్లి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీకి కృతజ్ఞతల వెల్లువ

ఆత్రేయపురం, (ఆంధ్రజ్యోతి): దసరా, దీపావళి కానుకగా జీఎస్టీ తగ్గించడంపై ప్రధాని నరేంద్రమోదీకి కృతజ్ఞతలు తెలుపుతూ మోదీ చిత్రపటానికి పలువురు పాలాభిషేకం చేశారు. ఆత్రేయపురంలో సోమవారం బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కాలాబత్తుల చిన్నారి ఆధ్వర్యంలో మోదీ చిత్రపటానికి పాలాభిషేకం జరిపి, జీఎస్టీ తగ్గింపుపై వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం

రావులపాలెం, (ఆంధ్రజ్యోతి): జీఎస్టీపై కేంద్రం తీసుకున్న నిర్ణయంతో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం జరిపారు. రావులపాలెం సెంటర్ వద్ద బీజేపీ సీనియర్ నాయకుడు మద్దింశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి.సత్యానందంతోపాటు చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు, కూటమి నాయకులు మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా అధికార ప్రతినిధి పాలూరి జయప్రకాశ్‌నారాయణ, చాంబర్ అధ్యక్షులు పోతంశెట్టి కనికిరెడ్డి, గుత్తుల పట్టాభిరామారావు, నందం సత్యనారాయణ, అంబటి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేటలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కూటమి నేతలు

ఎమ్మెల్యే వేగుళ్ల భవానీదీక్ష స్వీకరణ

మండపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఆయా పండుగల్లో వచ్చే దీక్షలను తీసుకోవడం ఆనవాయితీ. దసరా సందర్భంగా సోమవారం రథం గుడిలోనున్న బాలాత్రిపురసుందరి అమ్మవారిని దర్శించుకుని దసరా వేడుకలకు అంకురార్పణ చేశారు. ఈ వేడుకల్లో ఆయన ప్రత్యేక అమ్మవారికి ప్రత్యేక చేశారు. అనంతరం ఆయనకు టీటీడీ వేద పండితుడు శ్రీనివాసరావు తదితరులు ఆశీర్వాదాలు అందించారు. కార్యక్రమంలో దేవస్థానం కార్యదర్శి కామేశ్వరరావు తదితరులు వున్నారు.



రథంగుడిలో శరన్నవరాత్రి వేడుకల్లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే

స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను సద్వినియోగం చేసుకోండి



కె.గంగవరం మండలం సుందరపల్లిలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ హర్షిత

కె.గంగవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): స్వస్థ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్య శిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు కె.చంద్రరావు అన్నారు. సోమవారం సుందరపల్లిలో జరిగిన వైద్య శిబిరంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. ప్రధాని మోడీ మహిళల ఆరోగ్య రక్షణకు దీన్ని ఏర్పాటు చేశారని తెలిపారు. పామర్రు వైద్యాధికారి హర్షిత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సేవలందించారు. మహిళలకు పలు పరీక్షలు జరిపి, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు అవసరాల రమణమూర్తి, సున్న సత్యనారాయణ, గుర్రాల సత్యనారా యణ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

కపిలేశ్వరపురం, (ఆంధ్రజ్యోతి): అంగర పీహెచ్‌సీ వైద్యాధికారి రత్నకుమారి ఆధ్వర్యంలో స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నిర్వహించిన వైద్య శిబిరం లో వైద్య పరీక్షలతో పాటు పలు ఆరోగ్య సేవలు అందజేశారు. ఈసందర్భంగా ఎంపీహెచ్‌ఈవో మల్లిఖార్జునుడు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ రామారావు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఐసీడీఎస్ శాఖకు సంబంధించి పోషక ఆహార స్టాల్‌ను నిర్వహించారు. వైద్య శిబిరంలో హెచ్ఎస్ నానిబాబు, హెచ్‌వీ మేరీమణి, ల్యాబ్ టెక్నీషియన్ ఆలీ, ఆరోగ్య, ఆశకార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేట, (ఆంధ్రజ్యోతి): స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్‌ను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని వాడపాలెం సర్పంచ్ త్సామా ఆదినారాయణమూర్తి పేర్కొన్నారు. సోమవారం వాడపాలెం, మోడేకుర్రు గ్రామాల్లో వైద్య శిబిరాలతో పాటు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గర్భిణులకు సీమంతాలు జరిపారు. కార్యక్రమంలో అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎస్.శ్రీవిద్య, మోడేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి, బి.వెంకట కుమార్, గొలకోటి ఏసు, ఆర్ఐ రవిశంకర్, కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



కొత్తపేట మండలం వాడపాలెంలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

నేటి నుంచి ఆధార్ కేంద్రాలు ప్రారంభం



మున్సిపల్ కమిషనర్ రంగారావు

మండపేట, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండపేట మున్సిపాల్టీలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో నేటి నుంచి ప్రత్యేక ఆధార్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామని మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు తెలిపారు. ఈ శిబిరాలు మంగళవారం నుంచి 26 వరకు పని చేస్తా యని ఆయన చెప్పారు. ఆరు నెలల నుంచి 1.15 సంవత్సరాల పిల్లల వరకు ఆధార్ తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోవాలని ఆయన కోరారు. పట్టణ ప్రజలంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నేటి నుంచి 24వ తేదీ వరకు గొల్లలగుంట, 25 నుంచి 26వ తేదీ వరకు 2వ సచివాలయం, శ్రీరామాహిందు మున్సిపల్ హైస్కూల్లో కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు ఆధార్ సెంటర్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

జగన్మోహిని కేశవస్వామి ఆలయ చైర్మన్‌గా నాగేశ్వరరావు



ఆత్రేయపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ర్యాలి జగన్మోహిని కేశవస్వామి ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్‌గా మెర్ల నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఎమ్మెల్యే సత్యానందరావు ఆదేశాల మేరకు నియామకాలు చేపట్టారు. మరో పది మంది ధర్మకర్తలను నియమించారు. ర్యాలి సమయమంతుల మాతంశెట్టి వార్ల అన్నదాన సత్రం చైర్మన్‌గా వరదా శేషావతారం, మరో 8 మంది సభ్యులు నియమించారు. ర్యాలి వాగ్దేవి నగర మహాలక్ష్మి అమ్మవారి ఆలయ చైర్మన్‌గా నామాల శ్రీనివాస్, మరో 8 మంది ధర్మకర్తలను నియమిస్తూ ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసింది. త్వరలోనే చైర్మన్లు, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం నిర్వహించి బాధ్యతలు తీసుకోనున్నారు.

ఇరిగేషన్ స్థలంలో మద్యం షాపును తొలగించాలి

ఆత్రేయపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ పరిధిలోని కాలవలు, ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేసిన మద్యం షాపులను తక్షణమే తొలగించాలని గోదావరి సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు ఉన్నతాధికారులను కోరారు. మండలంతో పాటు ఆయా ప్రాంతాల్లో పంటకాలువల పక్కనే అక్రమంగా మద్యం షాపులను తప్పుడు డోర్ నెంబర్లతో ఏర్పాటు చేశారని తక్షణమే వాటి లైసెన్సులను రద్దు చేయాలని సోమవారం ఎంపీడీవో వెంకటరామన్‌కు ఆయన వినతిపత్రాన్ని అందజేశారు.

ఆక్రమణల తొలగింపు



బస్టాండ్‌లో వున్న ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

మండపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వున్న మున్సిపల్ బస్టాండ్‌లో ఏళ్ల తరబడి ఆక్రమణలో వున్న పలు దుకాణాలను సోమవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. బస్టాండ్‌లో వున్న పలుబడ్డీలు, దుకాణాలను సిబ్బందితో పాటు పట్టణ ప్రణాళిక విభాగం, సచివాలయ ఉద్యోగుల సమక్షంలో శానిటరీ సిబ్బంది వాటిని తొలగించారు. తొలగించిన వాటిని ట్రాక్టర్‌పై వాటర్ వర్క్సు లోకి ప్రాంగణంలోకి తరలించారు. ఆక్రమణలు తొలగించటంతో ఏళ్ల తరబడి ఉపాధి పొందుతున్న చిరు వ్యాపారులు వీధినపడ్డారు. పట్టణ సుం దరీకరణ, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా ఆక్రమణలు తొలగిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. తమకు ప్రత్యామ్నాయ ఉపాధి చూపించాలని చిరు వ్యాపారులు విజ్ఞప్తి చేశారు.

సొసైటీ నూతన భవన నిర్మాణానికి తీర్మానం

కె.గంగవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): అముజూరు సొసైటీ భవనం శిథిలావస్థకు చేరుకున్న నేపథ్యంలో నూతన భవన నిర్మాణం చేయాలని పాలకవర్గం నిర్ణయించింది. సోమవారం సొసైటీ అధ్యక్షుడు పెంకే గోవిందరాజు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. దీనిలో నూతన భవన నిర్మాణానికి తీర్మానం చేశారు. ఈ సందర్భంగా గోవిందరాజు మాట్లాడారు. సమావేశంలో పాలకవర్గ సభ్యులు నేమాని సత్యనారాయణ మూర్తి, ఏడిద గంగాధరరావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరివాడ చిన్నికృష్ణ, సొసైటీ సీఈవో సి. వాసు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదు కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలి

రావులపాలెం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): బాధితుల కోసం ఏర్పాటు చేసిన ఫిర్యా దు కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని పోలీస్ బాధితుల సంఘ అధ్యక్షుడు మెర్ల శాస్త్రులు అన్నారు. రావులపాలెంలో ఆయన మాట్లాడుతూ ప్రజలతో పోలీసులు అన్యాయంగా వ్యవహరించినప్పుడు, కేసు నమోదు చేయడానికి వారు నిరాకరించినప్పుడు ఈ కేంద్రాల ద్వారా న్యాయం పొందవచ్చునన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు పోలీస్ ఫిర్యాదు కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం రాజవోలులో కంప్లైట్స్ అథారిటీ సెంటర్ ఉందని, దీన్ని బాధితులు వినియోగించుకోవాలని ఆయన సూచించారు.

దోమలు, కుక్కల నిర్మూలన చేపట్టాలి

రాయవరం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాల్లో దోమలు, కుక్కల బెడదతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి నిర్మూలకు చర్యలు చేపట్టాలని బీజేపీ నాయకులు సోమవారం ఎంపీడీవో ఎస్.కీర్తి స్పందనకు వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బీజేపీ నేతలు మాట్లాడుతూ గ్రామాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందన్నారు. కొన్ని గ్రామాల్లో పారిశుధ్య లోపంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అధికారులు సమస్యను పరిష్కరిం చాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు చాత్రాతి జానకి రాంబాబు, చిరట్ల సుబ్బారావు, చింతా తమ్మిరెడ్డి, నరాల రాంబాబు, పిల్లి సత్యనారాయణ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆర్.శ్రీనివాస్, మద్దా మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



రాయవరం ఎంపీడీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు



డిప్యూటీ సీఎం పవన్‌కు వినతిప్రతం అందజేస్తున్న దృశ్యం

నియోజకవర్గ సమస్యలపై డిప్యూటీ సీఎం పవన్‌కు వినతిపత్రం

మండపేట, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్‌ను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, మండపేట నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జీ ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ అమరావతిలో సోమవారం కలిసారు. మండపేట నియోజకవర్గంలో వున్న సమస్యలు డిప్యూటీ సీఎం పవన్‌కు వివరించి వినతి పత్రం అందజేశారు. నియోజకవర్గ సమస్యలు విన్న పవన్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.



అన్నదానానికి విరాళం ఇచ్చిన దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఆత్రేయపురం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమండ్రికి చెందిన కంకటాల సుబ్రహ్మణ్యేశ్వరరావు, లక్ష్మీసుందరీ దంపతులు రూ.1.07 లక్షలు, కొమరాజులంకకు చెందిన సత్తి కుమారి దంపతులు రూ.25,116 విరాళం అందజేశారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని పూజలు జరిపారు. అనంతరం స్వామివారి అన్నప్రసాదంలో పాల్గొన్నారు.

పశుసంరక్షణకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

కె.గంగవరం, సెప్టెంబరు 22(ఆంధ్రజ్యోతి): పశుసంరక్షణకు ప్రభుత్వం కృషి చేస్తుందని యర్రపోతవరం డీసీ అధ్యక్షులు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు అన్నారు. సోమవారం గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేసే కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పేకేరు పశువైద్యశాల వైద్యులు జి. సురేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది టీకాలు వేశారు. వ్యవసాయశాఖ రామచంద్రపురం ఏడీఏ ఓ.రామకృష్ణ పర్యవేక్షించారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.



శివలలో పశువులకు టీకాలు వేస్తున్న వైద్యులు

బాధ్యతలు స్వీకరించిన నూతన ఎంపీడీవో



ఎంపీడీవో భానుజీరావును అభినందిస్తున్న దృశ్యం

కపిలేశ్వరపురం, సెప్టెంబరు 22 (ఆంధ్రజ్యోతి): మండల నూతన ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించిన హెచ్.భానుజీరావును సోమవారం మండపేట తాలూకా ఏపీఎన్జీవో సంఘ అధ్యక్షులు జె.మల్లిఖార్జునుడు ఆధ్వర్యంలో వివిధ శాఖల ఉద్యోగులు కలిసారు. ఆయన్ను మండల పరిషత్ కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ జి.శ్రీనివాస్, వ్యవసాయ శాఖ ఏవో రవి, హౌసింగ్ ఏఈ శ్రీనివాసరెడ్డితోపాటు ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.